


ఎల్‌నినో.. సామాన్యుడిపైనే భారం

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3   సంచిక -130   బుధవారం 28 అక్టోబర్ 2026   ఎడిటర్ : బిర్రు కరుణాకర్   పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# తెలంగాణలో కరువు కల్లోలం..

## 365 మండలాలు ప్రభావితం!

111 మండలాల్లో తీవ్ర కరువు..

రైతులకు సాయం, తాగునీరు, పశుగ్రాసంపై ప్రభుత్వ దృష్టి







## అభిషేక్ శర్మ తుఫాన్.. భారత్‌కు సిరీస్ కైవసం!

35 బంతుల్లోనే శతకం.. న్యూజిలాండ్‌పై ఆరు వికెట్లతో ఘన విజయం

## రాజీవ్ ప్రధాని కావడాన్నే వ్యతిరేకించా!

సోనియా గాంధీ ఆత్మకథలో సంచలన విషయాలు!




**న్యూఢిల్లీ,అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన జీవితంలోని వ్యక్తిగత, రాజకీయ అనుభవాలను ఆత్మకథ రూపంలో వెల్లడించనున్నారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో రూపొందిన ఈ పుస్తకం నవంబర్ 10న విడుదల కానుంది.ఇందిరా గాంధీ హత్య అనంతరం రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావడాన్ని

మిగతా2లో...

## భూ సర్వేలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు!

- రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
: మంత్రి పొంగులేటి
- ఏడాదిన్నరలో భూ సర్వే పూర్తి.
అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు






## తుఫాన్ సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వద్దు!

- ప్రజల ప్రాణాలే ప్రాధాన్యం..
అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశాలు

**అమరావతి,అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**ఆర్నబ్ తుఫాన్ ముప్పు నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ ఆదేశించారు. కాకినాడ జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులతో

మిగతా2లో...

## డిసెంబర్ 9న మహిళలకు కుట్టు మిషన్లు!

• 1.90 లక్షల మంది బీసీ మహిళలకు లబ్ధి • 4.80 లక్షల దరఖాస్తులు..
పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేయండి: మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్,అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**తెలంగాణలో బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో చేపట్టిన 'ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల' పథకం అమలును వేగవంతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 9న కుట్టు మిషన్ల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ పథకానికి ఇప్పటికే 4.80 లక్షల దరఖాస్తులు అందాయని, తొలి దశలో 1.90 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూర్చేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. మంగళవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ, విద్యా నిధి పథకాలపై నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించాలని, అర్హులైన వారికి సకాలంలో ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కుట్టు మిషన్ల పంపిణీకి సంబంధించిన టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. **గురుకులాలకు సొంత భవనాలు** రాష్ట్రంలో 327 బీసీ గురుకుల పాఠశాలలు ఉండగా, వాటిలో కేవలం 26 పాఠశాలలకే సొంత భవనాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. మిగిలిన 301 పాఠశాలలకు శాశ్వత భవనాలు కల్పించేందుకు భూసేకరణ, నిర్మాణ

మిగతా2లో...



## నిజాయితీగా జరిగితేనే ఎన్నికల ఫలితాలను అంగీకరిస్తా: ట్రంప్

అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడి వ్యాఖ్యలు

**వాషింగ్టన్,అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**అమెరికాలో నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికల ఫలితాలను నిజాయితీగా జరిగిన ఎన్నికలుగా భావిస్తేనే అంగీకరిస్తానని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలను ఎలాంటి పరిస్థితుల్లోనైనా అంగీకరిస్తారా అని విలేకరులు ప్రశ్నించగా, ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగితే అంగీకరిస్తానని సమాధానమిచ్చారు. ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోతే ప్రతిపక్ష డెమోక్రాట్లతో కలిసి పనిచేయాల్సి వస్తుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. మిగతా2లో...

## కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలి!

• తాగు, సాగునీటితో పాటు విద్యుత్‌కూ ఉపయోగం: మాజీమంత్రి జీవన్‌రెడ్డి




**హైదరాబాద్,అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**ఎల్‌నినో ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి టి. జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నీటిని ఎత్తిపోయేందుకు తగిన నీటిమట్టం లేకపోతే కాఫర్ డ్యాం నిర్మించాలని సూచించారు. రైతులు నీరు, విద్యుత్ అడగవద్దన్నట్టుగా వ్యవహరిస్తూ, వరి విత్తనాలు కొనుగోలు చేసే రైతుల నుంచి స్వీయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి మిగతా2లో...

# తుఫాన్ సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వద్దు!

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం రాష్ట్ర సచివాలయంలో తుఫాన్ సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ప్రజల ప్రాణనష్టం జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని, తుఫాన్ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి** తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి, అక్కడ నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ముఖ్యంగా 92 తుఫాన్ ప్రభావిత ఆవాసాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రజలకు అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**ఏలేరు వరద ప్రవాహంపై నిఘా** ఏలేరు వరద ప్రవాహంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పవన్ కల్యాణ్ సూచించారు. చెరువులు, కాలువలు, వాగులు, రహదారులు, వంతెనల పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరా, తాగునీటి పంపిణీ, రహదారులకు అంతరాయం కలిగితే వెంటనే పునరుద్ధరించేందుకు సిబ్బంది, యంత్రాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

మత్స్య కారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచేలా చూడాలని సూచించారు. తుఫాన్ సహాయక చర్యల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని, ప్రజలకు అవసరమైన సహాయాన్ని వేగంగా అందించాలని పవన్ అధికారులకు స్పష్టం చేశారు.

# తెలంగాణలో కరువు కల్లోలం..

**హైదరాబాద్, అక్టోబర్ 2 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతున్నాయి. ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్2026 సీజన్‌కు సంబంధించి 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించింది. వీటిలో 111 మండలాలను తీవ్ర కరువు, 254 మండలాలను మధ్యస్థ కరువు ప్రభావిత ప్రాంతాలుగా వర్గీకరించింది. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఉపశమనం కల్పించడంతో పాటు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించింది.**సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం**ఈ ఏడాది జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు రాష్ట్రంలో సాధారణంగా 740.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 615.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో సాధారణం కంటే 17 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. వర్షాలు సకాలంలో కురవకపోవడం, పంటలకు అవసరమైన తేమ అందకపోవడం వల్ల సాగు విస్తీర్ణం తగ్గింది. గతంలో వరి సాగు 69.19 లక్షల ఎకరాలుగా ఉండగా, ఈ సీజన్‌లో సుమారు 57 లక్షల ఎకరాలకు తగ్గినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

**రైతులకు పెట్టుబడి సాయంపై ఆశలు**

కరువు ప్రభావంతో నష్టపోతున్న రైతులకు ఆర్థికంగా అండగా నిలవడం కీలకంగా మారింది. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం సాయం అందించడం, పంటల పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం అవసరమని వ్యవసాయ వర్గాలు పేర్కొంటున్నాయి. సాగు కోసం పెట్టిన పెట్టుబడులు తిరిగి రాకపోతే రైతు కుటుంబాలపై ఆర్థిక భారం పెరిగే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కరువు ప్రభావిత ప్రాంతాల్లో రైతులకు ఉపశమనం కలిగించే చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించింది. **తాగునీరు, పశుగ్రాసానికి ప్రాధాన్యం** వర్షాలు తక్కువగా కురవడంతో నీటి వనరుల్లో నిల్వలు తగ్గే అవకాశం ఉన్నందున గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అలాగే పశువులకు మేత, నీరు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా కరువు ప్రభావాన్ని కొంతవరకు తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

**కేంద్ర సాయం కోరే దిశగా చర్యలు**

కరువు ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను అంచనా వేసి, అవసరమైన సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సహకారం కోరే అంశంపై దృష్టి సారిస్తోంది. క్షేత్రస్థాయి పరిశీలనలు, నష్టం అంచనాల ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంది. 365 మండ లాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన నేపథ్యంలో రైతులకు సాయం, తాగునీటి సరఫరా, పశుగ్రాసం, గ్రామీణ ఉపాధి వంటి అంశాల్లో సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

ప్రభుత్వ ప్రకటనతో పాటు క్షేత్రస్థాయిలో సహాయం వేగంగా అందితేనే కరువు ప్రభావిత కుటుంబాలకు నిజమైన ఉపశమనం లభించనుంది.

# ఆయిల్‌పామ్ సాగు విస్తరణే లక్ష్యం!

- రైతులకు నాణ్యమైన మొక్కలు అందించాలి: మంత్రి తుమ్మల



**హైదరాబాద్,అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతులకు నాణ్యమైన మొక్కలను సకాలంలో అందించేలా కంపెనీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన ఆయన, ఆయిల్‌పామ్ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో ఏర్పాటు చేస్తున్న సమీకృత ఆయిల్‌పామ్ యూనిట్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించాలని కంపెనీ ప్రతినిధులు మంత్రిని కోరారు. యూనిట్‌కు అవసరమైన రహదారి విస్తరణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆరోతరం సంకర ఆయిల్‌పామ్ విత్తనాల ఉత్పత్తి కోసం దేశంలోనే తొలి విత్తన తోట ఏర్పాటు చేసేందుకు అదనంగా 35 ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. ఆధునిక ఆయిల్‌పామ్ పరిశ్రమ అభివృద్ధి కోసం అదనపు జిల్లాలను కేటాయించాలని, గెలల ధరల నిర్ణయంలో కంపెనీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రతినిధులు సూచించారు. ఈ అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. రహదారి విస్తరణ, భూమి కేటాయింపు సమస్యలను జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, గోద్రెజ్ అగ్రోవెట్ ఎండీ, సీఈవో సునీల్ కటారియా, గ్రూప్ హెడ్ రాకేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ జలాశయం నుంచి జూరాలకు కృష్ణా జలాలు

## - సాగునీటి అవసరాలు.. రైతుల పంటల పరిరక్షణపై దృష్టి



**హైదరాబాద్,అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** కర్ణాటకలోని నారాయణపూర్ జలాశయం నుంచి తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు కృష్ణా జలాల తరలింపు అంశం కీలకంగా మారింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల కింద సాగు చేస్తున్న పంటలకు నీటి అవసరాలు ఉండటంతో తెలంగాణ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వాన్ని నీటి విడుదలకు కోరింది. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం దశలవారీగా నీటిని విడుదల చేసేందుకు అంగీకరించి నట్లు గతంలో వార్తలు వెలువడ్డాయి. అయితే, నారాయణపూర్ నుంచి ఆశించిన స్థాయిలో నీరు చేరకపోవడంతో జూరాల ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొన్నట్లు అక్టోబర్ ప్రారంభంలో వార్తలు వచ్చాయి. పంటలను కాపాడటంతో పాటు రాబోయే రోజుల్లో తాగునీటి అవసరాలను తీర్చేందుకు నీటి లభ్యతను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

# అభిషేక్ శర్మ తుఫాన్.. భారత్‌కు సిరీస్ కైవసం!

**వెల్లింగ్టన్:అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్‌లో భారత జట్టు హ్యాట్రిక్ విజయంతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. మూడో టీ20లో ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగడంతో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3‌0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. డారిల్ మిచెల్ 89 పరుగులతో అజేయంగా నిలవగా, ఫిన్ అలెన్ 40, బెవాన్ జాకబ్స్ 39 పరుగులు చేశారు. 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 13.2 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి 199 పరుగులు చేసి విజయం సాధించింది. అభిషేక్ శర్మ కేవలం 38 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్సర్లతో 113 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతడు 35 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 19 బంతుల్లో 45 పరుగులతో మెరిపించాడు.వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 42 బంతుల్లోనే 133 పరుగులు జోడించారు. తొలి ఆరు ఓవర్లలోనే భారత్ వికెట్ నష్టపోకుండా 118 పరుగులు సాధించి ప్రపంచ రికార్డు నెలకొల్పింది. టీ20ల్లో భారత తరఫున అత్యధిక శతకాలు సాధించిన ఆటగాడిగా అభిషేక్ శర్మ 11 శతకాలతో విరాట్ కోహ్లీని అధిగమించాడు. ఈ అద్భుత ప్రదర్శనకు అభిషేక్ శర్మకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# రాజీవ్ ప్రధాని కావడాన్నే వ్యతిరేకించా!

(మొదటి పేజీ తరువాయి)

తాను వ్యతిరేకించినట్లు సోనియా తన పుస్తకంలో వెల్లడించారు. తన జీవిత కథను ఇన్నాళ్లూ ఇతరులే చెప్పారని, ఇప్పుడు తన అనుభవాలను తానే పాఠకులతో పంచుకోవాలనుకుంటున్నట్లు తెలిపారు.కేంబ్రిడ్జ్‌లో రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమ, వివాహం, నెహ్రూగాంధీ కుటుంబంతో జీవితం, కుటుంబంలో ఎదురైన విషాదాలు, రాజకీయ ప్రస్థానం వంటి అంశాలు ఈ ఆత్మకథలో చోటుచేసుకోనున్నాయి. తన జీవితంలోని కీలక మలుపులను సోనియా ఏ విధంగా వివరించారన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది.

# నిజాయితీగా జరిగితేనే ఎన్నికల ఫలితాలను అంగీకరిస్తా: ట్రంప్

(మొదటి పేజీ తరువాయి)

అలాంటి పరిస్థితి ఎదురైతే చర్చల ద్వారా ముందుకు సాగుతామని, అధ్యక్షుడిగా తనకు వీటో అధికారం ఉందని పేర్కొన్నారు.మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఓటర్ల మోసానికి సంబంధించిన ఆరోపణలను ఆయన మరోసారి ప్రస్తావించారు. అయితే, ఎన్నికల అక్రమాలపై ఆయన చేసిన విస్తృత ఆరోపణలకు ఆధారాలు లేవని వార్తా నివేదికలు పేర్కొన్నాయి.

# భూ సర్వేలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు!

**సంగారెడ్డి,అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** భూ సర్వే, రెవెన్యూ సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. మంగళవారం సంగారెడ్డిలో ఉమ్మడి మెదక్ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామితో కలిసి సమీక్ష నిర్వహించారు. రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.**భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం** రాష్ట్రంలో భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడంతో పాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా భూ పునఃసర్వే చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే 380 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మరో 900 గ్రామాల్లో చివరి దశకు చేరుకుందని పేర్కొన్నారు. ఏడాదిన్నరలోపు రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, ఆబాదీ ఆస్తుల సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.సర్వే సమయంలో భూమి విస్తీర్ణం, హద్దుల వివరాలను రైతులకు స్పష్టంగా తెలియజేయాలని, తహసీల్దార్ల నుంచి జిల్లా కలెక్టర్ల వరకు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సూచించారు.**పేదలకు సొంతింటి కల సాకారం** అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కొనసాగుతుందని పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా రెండు లక్షల ఇళ్లను మంజూరు చేసిందని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి, అర్హులకు పారదర్శకంగా కేటాయించాలని అధికారులను ఆదేశించారు.**ఎల్‌నినో ప్రభావంపై ఆందోళన** ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. రైతులు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి, నీటి లభ్యతను బట్టి సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు.ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 9న మహిళలకు కుట్టు మిషన్లు!

(మొదటి పేజీ తరువాయి)

అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే 38 బీసీ ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.బీసీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెంచేలా అధ్యయన కేంద్రాల్లో నాణ్యమైన శిక్షణ అందించాలని, బీసీ వితంతువులు, ఒంటరి మహిళలకు నైపుణ్య శిక్షణ కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఆధునిక రజక ధోబీఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.మహిళలకు స్వయం ఉపాధి, బీసీ విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పథకాలను వేగంగా అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలి!

(మొదటి పేజీ తరువాయి)

ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని కోరారు.వృథాగా సముద్రంలోకి వెళ్తున్న ప్రాణహిత జలాలను వినియోగించుకునే అవకాశం ఉందని, వాటితో తాగునీరు, సాగునీటి అవసరాలు తీర్చడంతోపాటు విద్యుత్ ఉత్పత్తికీ ప్రయోజనం కలుగుతుందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పాలన చేయలేని పరిస్థితి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుకుని గవర్నర్‌కు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్ట్ వార్త

బుధవారం 28 అక్టోబర్ 2026

# ఎల్‌నినో ప్రభావంపై గ్రామసభలు.. అభివృద్ధి పనుల పరిశీలన

## సాగులో జాగ్రత్తలు, నీటి సంరక్షణపై రైతులకు అవగాహన

**తల్లాడ/ అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని కుర్నవల్లి, బసవాపురం గ్రామాల్లో ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. కుర్నవల్లి గ్రామంలో సర్పంచ్ ఎక్కిరాల శేషమ్మ అధ్యక్షతన, బసవాపురం గ్రామంలో ఉపసర్పంచ్ పేటూరి నరసింహరావు అధ్యక్షతన సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవో, మండల వ్యవసాయ అధికారి, మిషన్ భగీరథ ఏఈ, నీటిపారుదల శాఖ ఏఈ పాల్గొని ఎల్‌నినో ప్రభావంతో సంభవించే వాతావరణ మార్పులు,




వ్యవసాయంపై వాటి ప్రభావం, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నీటి సంరక్షణ పద్ధతులపై రైతులకు, గ్రామస్థులకు వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.

అనంతరం ఎంపీడీవో శ్రీధర్‌రాజు కుర్నవల్లి గ్రామంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్థులు, పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

## హమాలీలకు జలగం బిక్షపతి పిలుపు

**వర్ధన్నపేట/అక్టోబర్27(జర్నలిస్ట్ వార్త):** అక్టోబర్ 31న నిర్వహించనున్న ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల హమాలీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జలగం బిక్షపతి హమాలీలకు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని, బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిందని, కార్మికుల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జలగం రవి, కొండేటి శ్రీనివాస్, జలగం మోహన్‌బాబు, యూనియన్ అధ్యక్షుడు కొండేటి రవి, ఎలుమకంటి వేణు, భుజంగం శామ్యూల్, యు.శీను, బి.ప్రకాష్, శ్రీ వెంకన్న, కె.సంపత్, వెంకటేశ్, బాబు, సుమన్, చిన్న రవి, అశోక్, స్వీపర్ సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

## -గడువు సమీపిస్తున్నందున పట్టభద్రులు త్వరగా నమోదు చేసుకోవాలి

## - కేంద్రాలను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

**తల్లాడ/ అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మంనల్గొండవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని తల్లాడ మండల ఇన్‌చార్జి మూడు ముంతల గంగరాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవింద్ శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్ పిలుపునిచ్చారు. పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాఘమయి దయానంద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ ఆదేశాల మేరకు మంగళవారం తల్లాడ మండలంలోని ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాలను కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా తెలగవరం గ్రామపంచాయతీలో ముఖ్య నాయకులతో సమావేశమై, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై చర్చించారు. గడువు సమీపిస్తున్న




నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు వీలైనంత త్వరగా ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డికి మద్దతుగా ఓటు వేయాలనుకునే పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలగవరం సర్పంచ్ భూక్యా కాలోజీ, ఉపసర్పంచ్ సిలివేరు నరసింహారావు, గ్రామ కాంగ్రెస్ నాయకులు దారెల్లి మస్తాన్, అనంత రాములు, తూము వెంకటేశ్వర్లు, గొల్లమండల నరేష్ తదితరులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

మల్లవరంలోనూ ఓటరు నమోదు కేంద్రం సందర్శన మల్లవరం గ్రామ సర్పంచ్ కటిక కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పరిధిలోని ముఖ్య నాయకులు ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించారు. అర్హులైన పట్టభద్రులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఆలస్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లవరం సర్పంచ్ కటిక కిరణ్‌కుమార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఎర్రి కృష్ణారావు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సీతారామయ్య, తల్లాడ మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవీంద్ర, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు భూక్య అంజయ్య, కటిక ప్రసాద్, మేడి బలరాంతో పాటు పట్టభద్రులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో దేశభక్తి.. క్రమశిక్షణపై అవగాహన




**గీసుకొండ/అక్టోబర్ 27(జర్నలిస్ట్ వార్త):** పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గీసుకొండ మండలం గంగదేవిపల్లి శివారులోని ఉషోదయ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. సమాజంలో పోలీసుల పాత్ర, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలపై అవగాహన కల్పించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా గీసుకొండ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యత అలవర్చుకోవాలని సూచించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, ప్రజాసేవే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమకొండ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి ఆదుకోవాలి

## చౌక దుకాణాల ద్వారా ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయాలి

## సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ఏ స్టాలిన్ డిమాండ్

**హనుమకొండ/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో హనుమకొండ జిల్లాతో పాటు జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించి ప్రజలను ఆదుకోవాలని సీపీఐ హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ఏ స్టాలిన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఒక్కొక్కరికి అందిస్తున్న ఆరు కిలోల బియ్యానికి అదనంగా మరో ఆరు కిలోలు కలిపి మొత్తం 12 కిలోల బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర వస్తువులను చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేయాలని కోరారు.

మంగళవారం రామారంలోని ఓఆర్ఆర్ బ్రిడ్జి శాఖ సీపీఐ శాఖ సమితి సమావేశం శాఖ సహాయ కార్యదర్శి పొక్కుల సదానందం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఏ స్టాలిన్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టి, వర్షాభావంతో నష్టపోయిన పంటలకు తగిన నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని




డిమాండ్ చేశారు.

**కార్మికులకు ఉపాధి కల్పించాలి**

కరువు పరిస్థితుల కారణంగా పనులు కోల్పోతున్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేక పథకం ద్వారా ఉపాధి కల్పించాలని స్టాలిన్ కోరారు. ప్రజలకు ఆహార భద్రత కల్పించడంతో పాటు రైతులు, కార్మికులకు అండగా నిలిచేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి దామెర సుదర్శన్, శాఖ సహాయ కార్యదర్శి పొక్కుల సదానందం, నాయకులు పార్వతం భాగ్య, రాగల్ల ప్రభాకర్, గోల్కొండ సారయ్య, గడ్డం సారయ్య, వంకుడోతు రాజు కుమార్, జన్ను మంజుల, భోగం అనురాధ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఉత్పత్తులకు విలువ జోడింపుతో అధిక ఆదాయం



**వర్ధన్నపేట/అక్టోబర్ 27(జర్నలిస్ట్ వార్త):** రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓలు), స్వయం సహాయక సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సూచించారు. మంగళవారం వర్ధన్నపేట రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో కస్టమ్ హైరింగ్ కేంద్రాలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన



కల్పించారు. యంత్రాలు, పరికరాలను రాయితీపై పొందే అవకాశాలను వివరించారు. రైతుల నుంచి నేరుగా ఉత్పత్తులను సేకరించి, విలువ జోడించిన ఉత్పత్తులుగా మార్చి దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయాల నుంచి సాంకేతిక సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఎఫ్‌పీఓలు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, సహకార సంఘాల సీఈఓలు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ఎఫెక్ట్.. యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలే మేలు!

## కల్వలలో ఖేత్ బచావో అభియాన్ .. రైతులకు సబ్సిడీపై పెసర విత్తనాల పంపిణీ





**కేసముద్రం/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, యాసంగి 2026లో అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. భూమి సారాన్ని కాపాడుకోవడంతో పాటు సాగు ఖర్చులు తగ్గించుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కేసముద్రం మండలం కల్వల గ్రామంలో నిర్వహించిన 'ఖేత్ బచావో అభియాన్' కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల వైవిధ్యీకరణ, ఎల్‌నినో ప్రభావాలు, పంట అవశేషాల నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై పెసర విత్తనాలను పంపిణీ చేశారు.

**తక్కువ నీటితో సాగయ్యే పంటలపై దృష్టి**

ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులు సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న పంటలకు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఇతర తక్కువ నీటి పంటలను సాగు చేయాలని తెలిపారు. పంటల మార్పిడి ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు భూసారాన్ని పరిరక్షించుకోవచ్చని వివరించారు. ఎరువులను అవసరానికి అనుగుణంగా శాస్త్రీయ పద్ధతుల్లో వినియోగించాలని, నీటి వృథాను అరికట్టే పద్ధతులను అనుసరించాలని సూచించారు.

**పంట అవశేషాలు కాల్చితే భూసారానికి నష్టం**

పంట కోతల అనంతరం మిగిలే అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని ప్రయోజనకర సూక్ష్మజీవులు నశించడంతో పాటు భూసారం తగ్గుతుందని అధికారులు హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చకుండా సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించాలని, తద్వారా నేలలో సేంద్రియ పదార్థాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని, నానో యూరియాతో పాటు ఇతర ఎరువుల వినియోగంపై సరైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ, నీటిపారుదల, ఉద్యానవన, పశుసంవర్ధక, విద్యుత్ శాఖల అధికారుల సలహాలతో పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

**రైతులకు పెసర విత్తనాల పంపిణీ**

కల్వల గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్రు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీగంట సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎల్‌నినో ప్రభావాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మొగ్గు చూపాలని ఆయన కోరారు. మహబూబాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీర శ్రీనివాసరావు మాట్లాడుతూ తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని, అధిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు. సాగు ఖర్చులు తగ్గించుకుని రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూసపల్లి గ్రామ సర్పంచ్ ఉప్పలయ్య, కల్వల ఉపసర్పంచ్ పెద్దగోని రవి, ఆత్మ సభ్యుడు కళ్లెం శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి బానోతు వెంకన్న, ఉద్యానవన, నీటిపారుదల, పశుసంవర్ధక, ఐకేపీ, వి.బి.జి. రాంజీ శాఖల అధికారులు, కల్వల వ్యవసాయ విస్తరణ అధికారి, ప్రజాప్రతినిధులు, సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ అనుభవాలను పంచుకున్నారు.

# తల్లాడ వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టులో అధికారుల తనిఖీలు

## లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



**తల్లాడ/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టును వైరా వ్యవసాయ మార్కెట్ విజిలెన్స్ సభ్యులు నరేష్‌కుమార్, ఆంజనేయులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులోని రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులైన ధాన్యం, పత్తి, మిర్చి తదితర పంటలకు సంబంధించి మార్కెట్ నిబంధనల ప్రకారం మార్కెట్ ఫీజు వసూలు చేయాలని అధికారులు సూచించారు. మిర్చి పంటకు కూడా మార్కెట్లో నమోదవుతున్న ధరల ఆధారంగా నిబంధనల మేరకు ఫీజు వసూలు చేయాలని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహించే వారిపై మార్కెట్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మార్కెట్ నిబంధనల అమలులో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో వెంకటేశ్వర్లు, విజయకుమారి, నిర్మల, నాగభూషణం, పాషా తదితరులు పాల్గొన్నారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# పట్టభద్రులారా.. మేల్కొనండి!

## ఓటు నమోదు చేసుకోండి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోండి!

యువత నిర్లక్ష్యం చేస్తే ప్రశ్నించే గొంతుక బలహీనపడినట్టే!ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎవరిది? ప్రజాప్రతినిధులను ప్రశ్నించాల్సిన బాధ్యత ఎవరిది? పాలకులు ఇచ్చిన హామీలను నిలదీయాల్సిన శక్తి ఎవరిది? నిస్సందేహంగా అది యువతది.. ముఖ్యంగా విద్యావంతులది! కానీ ఓటు హక్కు పొందే విషయంలోనే నిర్లక్ష్యం చేస్తే రేపు తమ సమస్యలపై ప్రశ్నించే నైతిక బలాన్ని ఎలా సాధించగలరు? అందుకే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన యువతీ యువకులు తక్షణమే ఓటరుగా నమోదు చేసుకోవాలి

**డిగ్రీ చేతిలో ఉంది.. ఓటు హక్కు ఉందా?**

ఏళ్ల తరబడి చదువుకొని పట్టాలు పొందుతున్న యువతలో కొందరు పట్టభద్రుల ఓటరు నమోదుపై శ్రద్ధ చూపడం లేదు ఉద్యోగాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తారు నియామకాలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తారు విద్యారంగంలో సమస్యలున్నాయని ప్రశ్నిస్తారు కానీ తమ సమస్యలను శాసనమండలిలో వినిపించే ప్రతినిధులను ఎన్నుకునే అవకాశాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తే ప్రయోజనం ఏమిటి? సమస్యలపై ఆవేదన వ్యక్తం చేయడమే కాదు పరిష్కారానికి దోహదపడే ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలి

**ఓటు నమోదు చేయకపోతే ప్రశ్నించే అవకాశం చేజారినట్టే!**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతులకు తమ అభిప్రాయాన్ని బలంగా వినిపించే వేదిక నిరుద్యోగం ఉద్యోగ నియామకాలు విద్యాసంస్థల సమస్యలు ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలపై చట్టసభల్లో గళమెత్తే ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం ఇది అలాంటి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఓటరు జాబితాలో పేరు ఉండాలి అర్హత ఉన్నప్పటికీ నమోదు చేసుకోకపోవడం అంటే మన చేతిలో ఉన్న అవకాశాన్ని మనమే వదులుకోవడమే ఆ తర్వాత వ్యవస్థను నిందించడం వల్ల ప్రయోజనం ఉండదు

**ప్రలోభాలకు కాదు.. ప్రజా సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి!**

ఎన్నికలు వచ్చినప్పుడు తాత్కాలిక ఆకర్షణలకు




లోనుకాకుండా అభ్యర్థుల పనితీరు నిబద్ధత ప్రజా సమస్యలపై అవగాహనను బేరీజు వేయాలి విద్యావంతుల సమస్యలపై పోరాడే సామర్థ్యం ఎవరికి ఉంది? నిరుద్యోగుల పక్షాన నిలబడేది ఎవరు? ప్రజల గొంతుకగా నిలిచేది ఎవరు? అనే అంశాల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలి ఓటు అనేది అమ్ముకునే వస్తువు కాదు.. మన భవిష్యత్తును నిర్ణయించే ప్రజాస్వామ్య ఆయుధం

**యువత మౌనంగా ఉంటే.. సమస్యలు పరిష్కారమవుతాయా?**

సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వాలను విమర్శించడం రాజకీయాలపై చర్చించడం సులభమే కానీ ఓటరు నమోదుతో మొదలై ఓటు వినియోగంతో పూర్తయ్యే ప్రజాస్వామ్య బాధ్యతను నిర్వర్తించడం మరింత ముఖ్యం యువత చైతన్యవంతమైతేనే ప్రజాస్వామ్య వ్యవస్థకు బలం పెరుగుతుంది ప్రతి పట్టభద్రుడు తనతోపాటు అర్హులైన స్నేహితులు సహచరులు కుటుంబ సభ్యులను కూడా ఓటరు నమోదుకు ప్రోత్సహించాలి

**ఇప్పటికైనా మేల్కొనండి.. మీ హక్కును కాపాడుకోండి!**

ప్రజాస్వామ్యంలో నిర్లక్ష్యానికి తావు లేదు ఓటు హక్కు ఉందని చెప్పుకోవడం కాదు.. దాన్ని సద్వినియోగం చేసుకోవడమే నిజమైన చైతన్యం ఎన్నికల సంఘం ప్రకటించిన అర్హతలు నిబంధనలు గడువులను తెలుసుకొని పట్టభద్రుల ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి నమోదు పూర్తయిందని నిర్ధారించుకోవాలి ఎన్నికల సమయంలో తప్పనిసరిగా ఓటు వేయాలి
యువతీ యువకులారా.. మీ ఓటు మీ గొంతుక! మీ ఓటు మీ భవిష్యత్తు! మీ ఓటు ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం! ఓటరు నమోదులో నిర్లక్ష్యం వీడి ప్రజాస్వామ్య పరిరక్షణలో ముందుండండి అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి ప్రతి ఓటు ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించాలి విద్యావంతుల ఐక్యతతోనే బాధ్యతాయుతమైన నాయకత్వాన్ని ఎన్నుకునే మార్గం బలపడుతుంది



కొట్టె సుధాకర్( లెనిన్ )
సీనియర్ జర్నలిస్ట్ టీయూడబ్ల్యూజే(iju) జిల్లా కార్యవర్గ సభ్యులు 9908401581

# కేసముద్రం సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

## ప్రజా సమస్యలపై ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి సీపీఐ(ఎం) వినతి

**కేసముద్రం/ అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
కేసముద్రం మున్సిపాలిటీతో పాటు మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ(ఎం) కేసముద్రం మండల కమిటీ కార్యదర్శి గోడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.
ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకుండా నిధులు కేటాయించి, అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**వినతిపత్రంలోని ప్రధాన డిమాండ్లు ఇవే..**

కేసముద్రం పట్టణంలోని ప్రధాన కూడలిలో ప్రయాణికుల కోసం బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ పరిధిలోని కూడళ్ల వద్ద ప్రజా మరుగుదొడ్లు నిర్మించాలని



కోరారు. ప్రభుత్వ భూమిలో పార్కు ఏర్పాటు చేయడంతో పాటు పట్టణ యువతకు క్రీడా సౌకర్యాలు కల్పించేందుకు మినీ స్టేడియం నిర్మించాలని డిమాండ్ చేశారు.
విద్యార్థులు, నిరుద్యోగుల కోసం పోటీ పరీక్షల శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని, మహిళల ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించేలా గురుకుల డిగ్రీ కళాశాలలు నెలకొల్పాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి, అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన సౌకర్యాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.
కేసముద్రం మండలంలో పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనేతరులకు అర్హతల మేరకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. మహబూబాబాద్ నుంచి తాళ్లపూసపల్లి, కల్వాల మీదుగా వరంగల్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో రహదారుల విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని, తాళ్లపూసపల్లి చెరువును మంచినీటి రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలని కోరారు.
ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన ఈ సమస్యలపై ప్రభుత్వం, అధికారులు తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు మోడెం వెంకటేశ్వర్లు, సావిత్రి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రంలో అభివృద్ధి పనుల జోరు

## ఉప్పరపల్లిలో విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం కస్తూరిబా పాఠశాల నూతన భవనం ప్రారంభించిన ప్రజాప్రతినిధులు





**కేసముద్రం/ అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తూ రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి మంగళవారం కేసముద్రం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**బాలికల విద్యకు ప్రాధాన్యం**

కేసముద్రంలో నూతనంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల భవనాన్ని ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, నూతన భవనం అందుబాటులోకి రావడంతో విద్యార్థినులకు మెరుగైన వసతి, సౌకర్యాలు కలగనున్నాయని పేర్కొన్నారు. అనంతరం తరగతి గదులు, వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు.

**ఎనిమిది గ్రామాలకు విద్యుత్ సమస్యల నుంచి ఉపశమనం**

ఉప్పరపల్లి గ్రామంలో రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఉపకేంద్రం ద్వారా ఉప్పరపల్లి, అర్పణపల్లి, వెంకటగిరి, ఇంటికన్నె, కాట్రపల్లి, కొత్తచెరువు తండా, ముత్యాలమ్మ తండా, చంద్రు తండా గ్రామాలకు ప్రయోజనం చేకూరనుంది. స్థానికంగా విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు తక్కువ వోల్టేజీ సమస్యలు తగ్గి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.
విద్యుత్ ఉపకేంద్రం అందుబాటులోకి రావడంతో తమ చిరకాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఉపకేంద్రం కీలకంగా మారుతుందని స్థానికులు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, ఉప్పరపల్లి సర్పంచ్ సునీత కుమారస్వామి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సమ్మి గౌడ్, నీలం దుర్గేష్, బండారు వెంకన్న, దయాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై టీఆర్ఎస్ సమీక్ష

### పాత ఓటర్ల జాబితాను పరిశీలిస్తూ అర్హులందరూ నమోదు చేసుకునేలా కృషి చేయాలి



**జనగామ/చేర్యాల, అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**వరంగల్‌నల్గొండఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియపై చేర్యాల పట్టణంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణ శాఖ అధ్యక్షుడు ముత్యాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండ శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించి, అర్హులెవరూ నమోదు నుంచి తప్పిపోకుండా చూడాలన్నారు. గత ఓటర్ల జాబితాను కూడా పరిశీలిస్తూ పూర్తిస్థాయిలో నమోదు జరిగేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ముత్యాల అరుణ, వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమా శ్రీధర్, కౌన్సిలర్లు నిమ్మ సుప్రజ, రాజీవ్ రెడ్డి, నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, శివగారి అంజయ్య, ఒంగోలు చంటి, ఇన్నారెడ్డి, నర్ర ఉపేందర్ రెడ్డి, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు విడుదల ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎండీ కమ్యూనిటీ మెడిసిన్‌లో డాక్టర్ ప్రీతికి నాలుగో ర్యాంకు

### చేర్యాల పట్టణానికి గర్వకారణం.. ప్రతిభకు ప్రశంసల వెల్లువ



**జనగామ/చేర్యాల, అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
చేర్యాల పట్టణానికి చెందిన డాక్టర్ పోగుల ప్రీతి ఎండీ కమ్యూనిటీ మెడిసిన్‌లో నాలుగో ర్యాంకు సాధించి ప్రతిభ చాటుకున్నారు. మహారాష్ట్ర యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ విడుదల చేసిన ఫలితాల్లో ఆమె నాలుగో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్ ఎర్రోళ్ల ఎలిషా మనవరాలైన ప్రీతి సాధించిన ఈ విజయంతో కుటుంబ సభ్యులు, పట్టణవాసులు హర్షం వ్యక్తం చేశారు. వైద్య విద్యలో ఉన్నత ప్రతిభ కనబరిచి నాలుగో ర్యాంకు సాధించిన డాక్టర్ ప్రీతిని పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు. ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రీతి మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన విశ్వవిద్యాలయ అధ్యాపక సభ్యులకు, సహచరులకు, జూనియర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ టీవీలు

### చేతన ఫౌండేషన్ సేవలు అభినందనీయం: సీఎం సలహాదారు వేము నరేందర్ రెడ్డి




**కేసముద్రం/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక విద్యాబోధనకు చేయూతనందించేందుకు చేతన ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ ఇన్ఫోసిస్టమ్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు 10 డిజిటల్ టీవీలను పంపిణీ చేశారు. కేసముద్రం మండలం ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు, సీఎం సలహాదారు వేము నరేందర్ రెడ్డి, పార్లమెంటు సభ్యుడు బలరాం నాయక్ ఈ టీవీలను అందజేశారు. ఈ సందర్భంగా వేము నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. డిజిటల్ టీవీలు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు చేతన ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమని, భవిష్యత్తులో ఫౌండేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులు వెనిగళ్ల వెంకటేశ్వరరావు, ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, తాతా గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాట్రగడ్డ చంద్రశేఖర్‌తో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## బైరాన్‌పల్లిలో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు

### తరంగిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం





**హసన్‌పర్తి/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
హసన్‌పర్తి మండల పరిధిలోని బైరాన్‌పల్లి గ్రామంలో వికాస తరంగిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో, గ్రామపంచాయతీ సహకారంతో మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. డీఆర్‌డీఏ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మహిళల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడం, వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్యం పొందేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, శ్రీనివాస్, కుమారస్వామి, గ్రామ సర్పంచ్ సురేందర్, పంచాయతీ కార్యదర్శి వెంకన్న, ఏపీఎం నారాయణ, సీసీ అరుణతోపాటు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# యాసంగిలో వరి సాగు వద్దు.. ప్రస్తుత పంటను కాపాడాలి!

## ఎల్‌నినో ముప్పుపై రైతులకు అవగాహన కల్పించాలి వచ్చే ఏడాది జూలై వరకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు

**ఖమ్మం/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్న నేపథ్యంలో ప్రస్తుత వానాకాలం పంటను అన్ని విధాలా కాపాడాలని, రాబోయే యాసంగి సీజన్‌లో వరి సాగుకు దూరంగా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాలు పడిపోతున్న నేపథ్యంలో తాగునీటికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, వచ్చే ఏడాది జూలై వరకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.






మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంత్రి వివిధ శాఖల అధికారులతో ఎల్‌నినో పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. సాగునీరు, మిషన్ భగీరథ, వ్యవసాయం, భూగర్భ జలాలు, మార్కెటింగ్, విద్యుత్, వైద్యారోగ్య శాఖల అధికారులు తమ శాఖల పరిస్థితులను వివరించారు.

### వానాకాలం పంటకు రక్షణ

రైతులు ఎంతో శ్రమించి సాగు చేస్తున్న ప్రస్తుత వానాకాలం పంటను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రెండో పంట సాగుతో రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని, అందువల్ల యాసంగిలో వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, ఇతర తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేయాలని, ఉద్యాన పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. బిందు సేద్యం ఏర్పాట్లను వేగవంతం చేయడంతోపాటు స్థానిక పరిస్థితులను బట్టి తక్కువ నీటితో పండే పంటలకు నీరు అందించే అవకాశాలను పరిశీలించాలన్నారు.

### తాగునీటికే తొలి ప్రాధాన్యం

కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ వినియోగించాలని మంత్రి స్పష్టం చేశారు. కిన్నెరసాని నీటిని యాసంగి పంటలకు విడుదల చేయవద్దని, అవసరమైతే మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు వినియోగించాలని ఆదేశించారు.

నాగార్జునసాగర్ పరిధిలోని నియంత్రణ గేట్లు, షట్టర్లు, పంపిణీ వ్యవస్థలను మూసివేసి పాలేరు వరకు ప్రధాన కాలువల్లో నీటిని నిల్వ ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువలో మూడు పంప్‌హౌస్‌లను వినియోగించి సాధ్యమైనంత ఎక్కువ నీటిని నిల్వ చేయాలని సూచించారు. పాలేరు జలాశయంలోని నీటిని మూడు జిల్లాల తాగునీటి అవసరాలకు ఉపయోగపడేలా సమర్థంగా నిర్వహించాలన్నారు.

దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ సమీపంలో ఇసుక బస్తాలతో అడ్డుకట్టను పెంచి సుమారు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు వివరించారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల నీటి ఆవిరి, ఇంకుడు నష్టాలు పెరిగే అవకాశమున్నందున అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా సమయాలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నియంత్రించాలని, పైపులైన్ల లీకేజీలను అరికట్టి నీటి వృథాను నివారించాలని ఆదేశించారు. తాగునీటిని వాహనాలు కడగడం, తోటలకు వినియోగించడం వంటి అవసరాలకు వృథా చేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

### పాత నీటి పథకాలకు పునరుజ్జీవం

మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకునేందుకు గ్రామాల్లో పాత తాగునీటి పథకాలను పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట వ్యక్తిగత బోర్లు, ఓవర్‌హెడ్ నీటి నిల్వ ట్యాంకులను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఇందుకు అవసరమైన నిధులు, ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు.

### నీటి సంరక్షణ పనులు విస్తృతం చేయాలి

కరువు ముప్పును ఎదుర్కొనేందుకు గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి సూచించారు. వీబీ-జీ రామ్‌జీ పథకం నిధులతో ఇంకుడు గుంతలు, బోరు రీచార్జి గుంతలు, వ్యవసాయ కుంటలు నిర్మించాలని ఆదేశించారు. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చాల్సి ఉన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న సుమారు రూ.7,000 కోట్ల నిధులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగపడే పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

### పశుగ్రాసం కొరత రాకుండా చర్యలు

గ్రామాల్లో పశుగ్రాసం ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పచ్చిగడ్డి పెంపకాన్ని ప్రోత్సహించడంతోపాటు పశువులకు తగినంత నీరు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళా సంఘాలకు పశుగ్రాసం పెంపకం, సరఫరా బాధ్యతలు అప్పగించే అంశాన్ని పరిశీలించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

### కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు వద్దు

పత్తి, ధాన్యం కొనుగోళ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని, బ్లాక్ మార్కెటింగ్, అక్రమ సిండికేట్లకు అవకాశం లేకుండా మార్కెటింగ్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

### విద్యుత్ పొదుపుపై దృష్టి

విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా సమయాలను రైతులకు ముందుగానే తెలియజేయాలని, మోటార్లకు ఏర్పాటు చేసిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ఆదేశించారు. ఎండిపోయిన బోర్లను వినియోగించకుండా చూడాలని, గ్రామాలు, పట్టణాల్లో వీధి దీపాలను దశలవారీగా సౌర విద్యుత్‌తో నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

### పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాల్లోని పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రత పాటించడంతోపాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. 1986లో సుమారు 600 గ్రామాలు వరదల కారణంగా ముంపునకు గురైన సమయంలో అధికారులు ప్రజలకు ఆహారం, తాగునీరు అందించి సమర్థంగా పనిచేశారని మంత్రి గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితుల్లోనూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పిలుపునిచ్చారు.

### ఖమ్మంలో 10 మండలాల్లో తీవ్ర కరువు

ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లాలో 10 మండలాల్లో తీవ్ర కరువు, మరో ఏడు మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నాయని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలమట్టాలు సుమారు రెండు మీటర్లు తగ్గిపోయాయని పేర్కొన్నారు.

కామేపల్లి, మధిర, ఏన్కూరు, సత్తుపల్లి, ఎర్రుపాలెం మండలాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయని, ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు కూడా ఉన్నాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా, లంకాసాగర్ జలాశయాలను నింపడంతోపాటు నాగార్జునసాగర్ ఆయకట్టుకు కొంతమేర సాగునీరు అందించగలిగామని వివరించారు. రాబోయే యాసంగి సీజన్‌కు సాగునీరు అందుబాటులో లేదని, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మధిర, ఏన్కూరు తదితర నాలుగు మండలాల్లో పశుగ్రాసం కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఈ విషయంపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. అవసరమైన పశుగ్రాసాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### భద్రాద్రి జిల్లాలో 3.5 మీటర్లు తగ్గిన భూగర్భ జలాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు సుమారు 3.5 మీటర్లు తగ్గిపోయాయని వెల్లడించారు.

వానాకాలం పంటల సాగులో భాగంగా సుమారు 40 వేల ఎకరాల్లో వరికి బదులుగా ఇతర పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. భూగర్భ జలాలు మరింత తగ్గకుండా అధికారులను అప్రమత్తం చేశామని, కొత్తగా బోర్లు వేయకుండా అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు. రాబోయే ఆరు నెలల పాటు తాగునీటి సరఫరాకు అవసరమైన నీరు అందుబాటులో ఉందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నూతన డిప్యూటీ తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల శుభాకాంక్షలు

## మాదిగ విద్యార్థులు ఉన్నత విద్యతోనే లక్ష్యాలను సాధించాలి



**హసన్‌పర్తి/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
హసన్‌పర్తి మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆరెపల్లి సుమన్‌ను ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి పుట్ట రవి మాదిగ, మంద కొర్నేలు మాదిగ, మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు, హనుమకొండ జిల్లా నూతన దామెర మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి ఆరెపల్లి పవన్ మాదిగ, హనుమకొండ జిల్లా మహాజన సోషలిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, హసన్‌పర్తి ఎమ్మార్పీఎస్ కో-ఇన్‌చార్జి రాజారపు బిక్షపతి మాదిగ, ఎంఎస్పీ జిల్లా నాయకుడు మేకల రమేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ, హసన్‌పర్తి మండల మహాజన సోషలిస్టు పార్టీ నూతన అధ్యక్షుడు ఆకారపు రాజు మాదిగ, తోట శ్రీకాంత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.




**గ్రామస్థాయిలో నూతన కమిటీల ఏర్పాటు**

మాదిగల హక్కుల సాధన కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సంస్థాగత పునర్నిర్మాణంలో భాగంగా హసన్‌పర్తి మండలంలోని జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎంఎస్, మాదిగ విద్యార్థి సమాఖ్య (ఎంఎస్ఎఫ్) నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు నాయకులు తెలిపారు. సంఘాలను మరింత బలోపేతం చేస్తూ మాదిగల హక్కులు, సంక్షేమం కోసం సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

**విద్యతోనే సామాజిక అభివృద్ధి**

మందకృష్ణ మాదిగ 32 ఏళ్ల పాటు చేసిన పోరాట ఫలితంగా సాధించుకున్న రిజర్వేషన్ల ప్రయోజనాలను మాదిగ విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పేర్కొన్నారు. జనాభా దామాషా ప్రకారం లభించిన 9 శాతం రిజర్వేషన్లను ఉపయోగించుకొని విద్యా, ఉద్యోగ రంగాల్లో ముందంజ వేయాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమవుతున్న విద్యార్థులను గుర్తించి, వారిని తిరిగి విద్య వైపు నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశయాలను విద్య ద్వారా సాధించడమే వారికి ఇచ్చే నిజమైన గౌరవమని అన్నారు. మాదిగ వాడల్లోని యువత, విద్యార్థులు మద్యపానం, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి చదువు, అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. సామాజిక చైతన్యం, విద్యాభివృద్ధి, సంఘటిత శక్తిని పెంపొందించే లక్ష్యంతో నూతన కమిటీల పునర్నిర్మాణ కార్యక్రమాన్ని మందకృష్ణ మాదిగ సూచనల మేరకు ముందుకు తీసుకెళ్తామని నాయకులు తెలిపారు.

# భారీ వర్షాల హెచ్చరిక.. వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

## సిబ్బంది సెలవులు రద్దు.. అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలి



**ఖమ్మం/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లాలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు. అక్టోబర్ 27 నుంచి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి సెలవులు మంజూరు చేయరాదని ఆదేశించారు. వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బంది తమకు కేటాయించిన ప్రధాన కార్యస్థానాల్లోనే అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

భారీ వర్షాల నేపథ్యంలో గర్భిణులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని డాక్టర్ రామారావు సూచించారు. ప్రసవ తేదీ సమీపించిన గర్భిణులను ముందుగానే గుర్తించి సురక్షిత ప్రాంతాలకు లేదా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీటి శుద్ధి మాత్రలు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ఖమ్మం, సత్తుపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు తమ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజల ప్రాణరక్షణ, అత్యవసర వైద్య సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర వైద్య సహాయం అవసరమైతే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని లేదా 108, 104 సేవలను సంప్రదించాలని డాక్టర్ డి. రామారావు కోరారు.

# నూతన డిప్యూటీ తహసీల్దార్‌కు శుభాకాంక్షలు




**హసన్‌పర్తి/అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** పరకాల ఆర్డీవో కార్యాలయం నుంచి బదిలీపై వచ్చి హసన్‌పర్తి మండల నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆరేపల్లి సుమన్‌ను తెలంగాణ ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం (పీపీఎల్) రాష్ట్ర కన్వీనర్ చాతల్ల సదానందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుమన్‌కు పూల మొక్క అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎకూ అనిల్ కుమార్, మారుపాక రవి, చాతల్ల వేణుగోపాల్, దుప్పటి పౌలు తదితర నాయకులు పాల్గొన్నారు.

# "ఫ్రీ బస్సు ఎక్కి భార్య వెళ్లిపోయింది".. పథకం రద్దు చేయాలంటూ ఎమ్మెల్యేకు వ్యక్తి వినతి!

**కరీంనగర్ జిల్లా రేగులపల్లిలో ఘటన**

**కరీంనగర్ (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న మహాలక్ష్మి పథకంపై ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. తన భార్య ఫ్రీ బస్సు ఎక్కి వెళ్లిపోయిందని, ఆమె ఆచూకీ తెలియడం లేదని ఎమ్మెల్యే ఎదుట అతడు ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా తన భార్య కనిపించకుండా పోవడానికి ఉచిత బస్సు పథకమే కారణమంటూ దాన్ని రద్దు చేయాలని కోరాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం బెజ్జంకి మండలం రేగులపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది.



గ్రామంలో జరిగిన ఓ సమావేశానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి కనకయ్య అనే వ్యక్తి తన కుటుంబ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. తన భార్యతో గొడవ జరగడంతో ఆమెను మందలించానని, దీంతో ఆమె ఉచిత బస్సు ఎక్కి వెళ్లిపోయిందని కనకయ్య తెలిపాడు. రెండు మూడు రోజులుగా వెతుకుతున్నా ఆమె ఆచూకీ లభించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆమె కోసం వెతకడానికి ఇప్పటికే రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని చెప్పాడు. తన భార్య కనిపించకుండా పోవడానికి ఉచిత బస్సు పథకమే కారణమని భావిస్తున్నట్లు కనకయ్య ఎమ్మెల్యేకు తెలిపాడు. అందుకే ఆ పథకాన్ని రద్దు చేయాలని కోరాడు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.. మహిళ ఆచూకీ తెలుసుకునేందుకు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉచిత బస్సు పథకం వల్ల రాష్ట్రంలో ఎంతోమంది మహిళలు ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు.

జర్నలిస్ట్ వార్త





# 'అరుణాచల్ ప్రదేశ్'కు అగ్నిపరీక్ష

**అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):** అరుణాచల్ ప్రదేశ్‌లోని తూర్పు సియాంగ్ జిల్లాలో 11,200 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం ప్రతిపాదించడం స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళనలకు దారి తీస్తోంది. టిబెట్ లోని ఎగువ ప్రాంతంలో 60,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన భారీ జలవిద్యుత్ ప్రాజెక్టును చైనా నిర్మిస్తోంది. ఇది నదీ తీరప్రాంత దేశమైన భారత్‌కు సవాలు విసురుతోంది. వరదలు ముంచుకు రావడంతోపాటు అనేక ప్రాంతాలు జలమయమవుతాయి. అందుకనే అరుణాచల్‌ప్రదేశ్ సియాంగ్ ప్రాజెక్టును తలపెట్టింది. గత సెప్టెంబర్‌లో అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం ఈ ప్రాజెక్టు చేపట్టాలని తీర్మానించింది. ఈ మేరకు ప్రాజెక్టు ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక రూపకల్పనకు సంబంధించిన కార్యకలాపాలు స్థానిక ప్రజల్లో ఆందోళనలను రేకెత్తించాయి. ఈ ప్రాజెక్టు వల్ల 27 గ్రామాలు మునిగిపోతాయని, సుమారు 1.5 లక్షల మంది తమ ఇళ్లువాకిళ్లు, పంటపొలాలు, చారిత్రక ప్రదేశాలు సర్వం జలమయమవుతాయని ప్రజలు అభ్యంతరాలను లేవదీస్తున్నారు. కానీ ప్రభుత్వం ప్రజల ఆందోళనలను పరిష్కరించడానికి బదులు సైనిక బలగాలను మోహరించడం, కొందరిని అరెస్టు చేయడంతో ఆందోళనలు మిన్నుముట్టాయి. ఇటీవలి కాలంలో టిబెట్‌లో సంభవించిన ప్రకృతి వైపరీత్యాలను ఉదాహరణగా చూపిస్తూ ప్రాజెక్టు వల్ల అభివృద్ధి సంగతి ఎలా ఉన్నా ప్రకృతి వైపరీత్యాలు తప్పవని ప్రజలు భయపడుతున్నారు. పర్యావరణ పరంగా అరుణాచల్ ప్రదేశ్ అత్యంత సున్నితమైన ప్రదేశం. అందువల్ల భారీ ప్రాజెక్టులు చేపట్టేటప్పుడు పర్యావరణ పరిరక్షణ అంశాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. కానీ ఇలాంటి అంశాలను పట్టించుకోకుండా ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఏకపక్ష ధోరణిలో తన ఆనకట్ట నిర్మాణం సాగిస్తోంది. వాస్తవాధీన రేఖ వెంబడి చైనా తన గ్రే జోన్ వ్యూహాలను ఇంకా కొనసాగిస్తోంది. అంటే పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయకుండా ఒత్తిడి పెంచే చర్యల ద్వారా భారత్‌కు సవాలు విసురుతోంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో భారత్, చైనా సైనికుల మధ్య తరచుగా ముఖాముఖి సంఘర్షణలు, ప్రతిష్టంభనలు చోటు చేసుకుంటున్నాయని, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) డైరెక్టర్ జనరల్ ఇటీవల ధ్రువీకరించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా అరుణాచల్ ప్రదేశ్‌ను తన భూభాగంగా చైనా పేర్కొంటూ దానిని దక్షిణ టిబెట్‌గా పిలుస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ తన మౌలిక సదుపాయాల అభివృద్ధిని, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో రహదారులు, వంతెనలు, రవాణా వ్యవస్థలు, ఇతర వ్యూహాత్మక నిర్మాణాలను మరింత వేగంగా పూర్తి చేయడం తప్పనిసరి. అయితే అరుణాచల్ ప్రదేశ్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవడం, వారి ఆందోళనలను పరిష్కరించడం, ప్రాజెక్టు ఎందుకు చేపట్టవలసి వచ్చిందో ప్రజలకు వివరించడం, ఎలాంటి నష్టాలు సంభవించవని భరోసా ఇవ్వడం ఇవన్నీ ప్రభుత్వ బాధ్యతలు. సరిహద్దునున్న ప్రజలు దేశానికి మొదటి రక్షణ కవచంగా ఉండడమే కాకుండా, తమ భూమికి సంరక్షకులు. సాయుధ దళాలకు వీరి మద్దతు చాలా అవసరం. కానీ ప్రజలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న కార్యకర్తలను అరెస్టు చేయడం మరింత ఉద్రిక్తతలకు దారితీసింది. గత రెండు మూడు రోజులుగా నిరసనలు హింసాకాండకు దారితీశాయి. హింస ప్రభావిత జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం కూడా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత లోని సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ సుమారు 250 మంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సు (ఆర్ఎఎఫ్ ) సిబ్బందిని విమానం ద్వారా ముంబై నుంచి అరుణాచల్ ప్రదేశ్‌కు తరలించింది. తూర్పు సియాంగ్ జిల్లా ప్రధాన కేంద్రం పాసీఘాట్‌లో ఆర్‌పిఎఫ్ సిబ్బందిని మోహరింప చేశారు. ఇప్పటికే హింస ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్సుకు చెందిన అనేక బృందాలు మోహరించి ఉన్నాయి. శుక్రవారం రాత్రంతా నిరసనకారులు విధ్వంసకాండ సాగించారు. జాతీయ జలవిద్యుత్ సంస్థ (ఎన్‌హెచ్‌పి) కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌లో పార్కు చేసిన అనేక వాహనాలను తగుల బెట్టారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కాలింగ్ మోయోంగ్, మరో ఇద్దరు ఎంఎల్‌ఎల ఇళ్లను ధ్వంసం చేశారు. భద్రతాధికారులతో సంఘర్షణకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమాఖండ్ ప్రాంతీయ గిరిజనవర్గాల తోను, ఇతర సామాజిక వర్గా లతోను ఆదివారం చర్చలు జరిపారు. ప్రాజెక్టుపై తప్పుడు సమాచారం, దురభిప్రాయాలు వ్యాప్తి చెందుతున్నాయని, వాటిని నమ్మవద్దని సూచించారు. సియాంగ్‌లోయ ప్రజల ఆకాంక్షలకు, హక్కులకు ఎలాంటి నష్టం జరగదని, అలాగే జాతీయ ప్రయోజనాలను కూడా దృష్టిలో పెట్టకోవాలని సూచించారు. కానీ నిరసనకారులు తమ డిమాండ్లను నెరవేర్చాలని పట్టుపడుతున్నారు. జలవిద్యుత్ ప్రాజెక్టును రద్దు చేయాలని, మోహరించి ఉన్న సాయుధ దళాలను తిరిగి వెనక్కు పంపాలని, అరెస్టయిన పదిమంది నిరసనకారులను తక్షణం విడుదల చేయాలని, సస్పెండైన విలేజీ చీఫ్‌లను తిరిగి నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. సియాంగ్ ప్రాంత ప్రజల ఆందోళనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైతే ఇది ఇతర సమస్యలకు దారి తీస్తుంది. ప్రజల్లో పెల్లుబుకుతున్న నిరసనను తమ ప్రయోజనాలకు అనువుగా ఉపయోగించుకోవడానికి వ్యతిరేక శక్తులకు అవకాశం కల్పించినట్టు అవుతుంది. దేశ భద్రత, అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, స్థానిక ప్రజల ప్రయోజనాలు ఈ నాలుగింటి మధ్య సమతుల్యత పాటిస్తూ సియాంగ్ డ్యామ్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లక తప్పదు.

# కొత్త రూ.1,000 నోటుపై వైరల్ ప్రచారాన్ని ఖండించిన పీఐబీ

**అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
దేశంలో కొత్తగా రూ.1,000 నోటు విడుదల కానుందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. ఈ వార్తల్లో నిజం లేదని, అవన్నీ నకిలీ ప్రచారాలని స్పష్టం చేసింది. కొత్త రూ.1,000 నోటు విడుదలపై 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బీఐ) ఎలాంటి ప్రకటన చేయలేదని వెల్లడించింది.




ఇటీవల ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో పసుపు రంగులో ఉన్నట్లు కనిపించే రూ.1,000 నోటు చిత్రాలు వైరల్ అయ్యాయి. కొత్త నోటును ఇప్పటికే విడుదల చేశారని, మరికొందరు నిర్దిష్ట తేదీన అందుబాటులోకి రానుందని ప్రచారం చేశారు. దీంతో కొత్త నోటు వస్తుందా? అంటూ నెటిజన్లలో చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చింది. కొత్త రూ.1,000 నోటు విడుదలైందంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా తప్పని పేర్కొంది. ఇలాంటి వార్తలను నమ్మే ముందు అధికారిక సమాచారాన్ని పరిశీలించాలని, నిర్ధారణ కాని పోస్టులను ఇతరులకు షేర్ చేయవద్దని ప్రజలకు సూచించింది. ప్రస్తుతం దేశంలో ఆర్‌బీఐ మహాత్మా గాంధీ (న్యూ) సిరీస్‌లో రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లు చెలామణిలో ఉన్నాయి. 2016 నవంబర్ 8న కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దును ప్రకటించినప్పుడు అప్పటివరకు చెలామణిలో ఉన్న పాత రూ.500, రూ.1,000 నోట్లు చట్టబద్ధమైన చెల్లింపుల హోదాను కోల్పోయాయి. అనంతరం కొత్త డిజైన్‌తో రూ.500 నోటును ప్రవేశపెట్టారు. అయితే, రూ.1,000 నోటును తిరిగి చెలామణిలోకి తీసుకురాలేదు. దాని స్థానంలో ప్రవేశపెట్టిన రూ.2,000 నోటును కూడా ఆర్‌బీఐ 2023 మేలో చెలామణి నుంచి ఉపసంహరించుకునే ప్రక్రియను ప్రకటించింది. కాబట్టి కొత్త రూ.1,000 నోటుపై అధికారిక ప్రకటన వచ్చిందంటూ ప్రచారం చేసే పోస్టులను ప్రజలు నమ్మవద్దని అధికారులు సూచిస్తున్నారు.

# కీలకాంశం శాంతిభద్రతలే!

**అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
అధికారం కోల్పోయి 15 ఏళ్ళైనా ఇప్పటికీ అకాలీదళ్ కీలక నేతలు మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులతో ఏర్పర్చుకున్న సంబంధాల నుండి ప్రజల దృష్టి మళ్లించలేని పరిస్థితులు నెలకొన్నాయి. 2029 చివరినాటికి పంజాబ్‌ను మాదకద్రవ్యాలు లేని రాష్ట్రంగా మారుస్తాన ని ప్రతిజ్ఞ చేసిన అమిత్ షా అకాలీదళ్ నేతలతో సయోధ్య ద్వారా ప్రజలకు ఎటువంటి సందేశం ఇస్తారో ఆసక్తిగా మారుతుంది. కేవలం విధానపరమైన చర్యలు, అక్రమ మాదక ద్రవ్యాల నిల్వల స్వాధీనాలు మాత్రమే ప్రజా భద్రత సమస్యను పరిష్కరించలేవు. అదే విధంగా, కేంద్ర హోం మంత్రి ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్న సరిహద్దు భద్రత, కేంద్ర నిఘా, అంతర్రాష్ట్ర అక్రమ రవాణాను వేరొకరి సమస్యగా పరిగణించలేం. పంజాబ్‌కు ఉమ్మడి కార్యాచరణ, ధ్రువీకరించదగిన ఫలితాలు కావాలి. అంతేగానీ ఒకరి నిర్దోషిత్వాన్ని మరొకరు నిరూపించుకునే వాదనలు కాదు. అయినప్పటికీ, అక్టోబర్ 22న ఢిల్లీలో అమిత్ షా పర్యటనల వెనుక ఉన్న పెద్ద రాజకీయ ప్రాముఖ్యత వెలుగులోకి వచ్చింది. మరి కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఉత్తరప్రదేశ్, పంజాబ్ లలో రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నది. ఉత్తర ప్రదేశ్ పరిణామాలు ఒక విధంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తోపాటు బిజెపి రాజకీయ భవిష్యత్‌కు కీలక అంశం కానుండగా, ఇప్పటివరకు పంజాబ్ రాజకీయాలలో నిర్ణయాత్మక పాత్ర పోషించలేక పోతున్న బిజెపికి ఓ విధంగా ఈ ఎన్నికలు ఓ సవాల్‌గా పరిణమించాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ భవిష్యత్‌కు పంజాబ్ కీలకంగా మారడంతో, ఇక్కడ ప్రభుత్వాన్ని కాపాడుకోవడం ఆయన రాజకీయ మనుగడకే అనివార్యంగా మారనుంది. ఈ నేపథ్యంలో 2027 అసెంబ్లీ ఎన్నికలలో ఆప్, కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థులుగా కనిపిస్తుండగా, తిరిగి పొత్తు ఏర్పరచుకోవడం ద్వారా తమ రాజకీయ పట్టు పెంచుకోవాలని అకాలీదళ్, బిజెపి భావిస్తున్నాయి. అయితే, బిజెపి దాదాపు సగం సీట్లు కోరుతూ ఉండడంతో కొంతమేరకు ప్రతిష్టంభన ఏర్పడింది. కాగా, ఈ ఎన్నికలలో రాజకీయ అంశాలకన్నా శాంతిభద్రతలు ఒక కీలక అంశంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. గ్యాంగ్‌స్టరిజం ఇకపై సాధారణ నేరంగా కాకుండా నేడా రాష్ట్రంలో దోపిడీలు, లక్షిత హత్యలు, వ్యవస్థీకృత నేర ముఠాలు భయాన్ని వ్యాపింపజేస్తున్నాయి. పది నెలల తర్వాత, పంజాబ్ రాజకీయ చర్చలో మాదకద్రవ్యాలు, శాంతిభద్రతలు కేంద్రబిందువుగా మారాయి. ఈ రెండు సమస్యలు ఒకదానికొకటి ఆజ్యం పోస్తున్నాయి. మాదకద్రవ్యాల డబ్బు నేర ముఠాలను నిలబెడుతుంది. గ్యాంగ్‌స్టర్లు బెదిరింపులు, ఆయుధాలు, రక్షణను అందిస్తారు. వ్యాపారవేత్తలకు దోపిడీ ఫోన్ కాల్స్, బహిరంగ ప్రదేశాలలో కాల్పులు, పోలీసు సిబ్బందిపై దాడులు ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీస్తున్నాయి. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల హత్యలు మరో ఆందోళనకరమైన విషయాన్ని లేవనెత్తుతున్నాయి. పెరుగుతున్న అసహనంతో నైతికతను రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతి కేసులోనూ బాధ్యతను నిర్ధారించే దర్యాప్తు జరగాలి, కానీ ఏ వ్యక్తికీ లేదా సమూహానికీ తమ నమ్మకాలను హింసద్వారా రుద్దే హక్కు లేదు. ఈ నేపథ్యంలోనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా రెండు సార్లు ఎన్నికల సన్నాహాలకు పంజాబ్‌లో చేసిన పర్యటనలలో ఈ



అంశాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ఆయన కేవలం రావణుడిని దహనం చేయడానికి పంజాబ్‌కు రాలేదు. పర్విందర్ సింగ్ ఝోటా, బిక్రమ్‌జిత్ సింగ్, గుల్జార్ సింగ్‌ల కుటుంబాలను పరామర్శించడం ద్వారా మాదకద్రవ్యాల సంక్షోభానికి మానవత్వాన్ని జోడించారు. ముఖ్యంగా ఝోటా హత్య ఒక ఇబ్బందికరమైన ప్రశ్నను లేవనెత్తింది. పంజాబ్‌లో ఆ పని చేయడానికి పోలీసులు, నిఘా సంస్థలు, మాదకద్రవ్యాల నియంత్రణ అధికారులు ఉండగా, సామాజిక కార్యకర్తలే అనుమానిత మాదకద్రవ్యాల అమ్మకందారులను ఎందుకు ఎదుర్కోవాలి? సిబిఐ ఇప్పుడు ఈ కేసును స్వీకరించి, నిందితులను అదుపులోకి తీసుకుంది. పరస్పర విరుద్ధమైన రాజకీయ ఆరోపణలు కాకుండా, దర్యాప్తు మాత్రమే అసలు ఏం జరిగిందో, అధికారులు తమ విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారో లేదో నిర్ధారించాలి. లుధియానా ఘటనలో ఒక విచిత్రమైన వైరుధ్యం ఉంది. 2016లో, అప్పటి కాంగ్రెస్ నాయకుడైన రవ్‌నీత్ సింగ్ బిట్టు, ఎస్‌ఎడిడీ- బిజెపి ప్రభుత్వాన్ని ఖండిస్తూ చిత్త రావణ దహనంలో పాల్గొన్నారు. పదేళ్ల తర్వాత, ఈసారి ఆప్‌కు వ్యతిరేకంగా మరో చిత్త రావణం అగ్నిజ్వాలల్లో కాలిపోతుండగా ఆయన అమిత్ షా పక్కన నిలబడ్డారు. పార్టీలు మారతాయి, ప్రభుత్వాలు మారతాయి, చివరికి రాజకీయ విధేయతలు కూడా మారతాయి. కానీ మాదకద్రవ్యాల రావణం మాత్రం అలాగే ఉంటుంది. ఆప్ తన పోలీసు, మాదకద్రవ్యాల నిరోధక రికార్డుకు జవాబు చెప్పాల్సిన పరిస్థితి నేడు ఏర్పడింది. గతంలో అకాలీదళ్- బిజెపి ప్రభుత్వం అప్రతిష్ఠపాలు అయ్యేందుకు సైతం మాదకద్రవ్యాలు ఓ ప్రధాన కారణం అని మరచిపోలేం. అధికారం కోల్పోయి 15 ఏళ్ళైనా ఇప్పటికీ అకాలీదళ్ కీలక నేతలు మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులతో ఏర్పర్చుకున్న సంబంధాల నుండి ప్రజల దృష్టి మళ్లించలేని పరిస్థితులు నెలకొన్నాయి. 2029 చివరినాటికి పంజాబ్‌ను మాదకద్రవ్యాలు లేని రాష్ట్రంగా మారుస్తానని ప్రతిజ్ఞ చేసిన అమిత్ షా అకాలీదళ్ నేతలతో సయోధ్య ద్వారా ప్రజలకు ఎటువంటి సందేశం ఇస్తారో ఆసక్తిగా మారుతుంది. కేవలం విధానపరమైన చర్యలు, అక్రమ మాదకద్రవ్యాల నిల్వల స్వాధీనాలు మాత్రమే ప్రజా భద్రత సమస్యను పరిష్కరించలేవు. అదే విధంగా, కేంద్ర హోం మంత్రి ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్న సరిహద్దు భద్రత, కేంద్ర నిఘా, అంతర్రాష్ట్ర అక్రమ రవాణాను వేరొకరి సమస్యగా పరిగణించలేం. పంజాబ్‌కు ఉమ్మడి కార్యాచరణ, ధ్రువీకరించదగిన ఫలితాలు కావాలి. అంతేగానీ ఒకరి నిర్దోషిత్వాన్ని మరొకరు నిరూపించుకునే వాదనలు కాదు. అయినప్పటికీ, అక్టోబర్ 22న ఢిల్లీలో అమిత్ షా పర్యటనల వెనుక ఉన్న పెద్ద రాజకీయ ప్రాముఖ్యత వెలుగులోకి వచ్చింది. ఆ రోజు ఆయన 2027లో పంజాబ్‌లో ఎన్‌డిఎ ప్రభుత్వం గురించి మాట్లాడారు. ఆయన కేవలం బిజెపి గురించి మాత్రమే ప్రస్తావించలేదు. ఈ వ్యత్యాసం, శిరోమణి అకాలీ దళ్‌తో తిరిగి కలవడంపై ఊహాగానాలను సహజంగానే మళ్లీ రేకెత్తించింది. మరుసటి రోజు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ మాట్లాడుతూ, కాంగ్రెస్, ఆప్‌లను తోసిపుచ్చుతూ, తమ భావజాలాన్ని పంచుకునే పార్టీలతో పొత్తులకు ఎస్‌ఎడి సిద్ధంగా ఉందని చెప్పారు. అయితే, పంజాబ్ బిజెపి అధ్యక్షుడు కేవల్ సింగ్ ధిల్లాన్, బిజెపి మొత్తం 117 స్థానాల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతోందని స్పష్టం చేశారు. తెరవెనుక చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ, ఎలాంటి పొత్తు లేదా సీట్ల పంపకం ఒప్పందం అధికారికంగా ప్రకటించలేదు. పంజాబ్‌లో మారుతున్న రాజకీయ సమీకరణం ఇక్కడే ఉంది. 2020లో వ్యవసాయ చట్టాల విషయంలో విడిపోవడానికి ముందు, ఎస్‌ఎడి 94 స్థానాల్లో, బిజెపి 23 స్థానాల్లో పోటీ చేశాయి. ఇప్పుడు బిజెపి గణనీయంగా పెద్ద పాత్రను కోరుకుంటున్నట్లు తెలుస్తున్నది. అయితే అకాలీలకు తమ సొంత సంస్థాగత ప్రయోజనాలు, రాజకీయ భారాలు ఉన్నాయి. ఏ పునరేకీకరణ అయినా రైతుల ఆందోళన, నాయకత్వ విశ్వసనీయతపై ప్రశ్నలు, ఓట్ల బదిలీ అనే క్లిష్టమైన సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది, పొత్తు అంటే కేవలం రెండు పార్టీల ఓట్ల వాటాలను కలపడం మాత్రమే కాదు. అది అభిప్రాయాలను మార్చగలదు, కానీ పాత ప్రశ్నలను కూడా మళ్లీ లేవనెత్తగలదు. అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే వాటిలో ఒకదానిని అందిపుచ్చుకున్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన ప్రచారం చేస్తున్నప్పుడు అమిత్ షా అకాలీ నాయకుడు బిక్రమ్ సింగ్ మజీతియాతో చేతులు కలపడం అనే అవకాశాన్ని ఆయన ఎగతాళి చేశారు. ఇది ఒక రాజకీయ దాడి, అంతేగానీ నేరపూరిత తప్పిదానికి రుజువు కాదు. కానీ, పునరుద్ధరించే పొత్తు ఓటర్లకు వివరించవలసిన వైరుధ్యాలను ఇది స్పష్టం చేస్తుంది. కాంగ్రెస్‌కు కూడా ఈ సవాలు ఏమాత్రం తక్కువ తీవ్రమైనది కాదు. పర్గత్ సింగ్ ఇటీవల రాష్ట్ర విభాగానికి బాధ్యతలు స్వీకరించారు. అనుభవజ్ఞులైన నాయకులు, పరస్పర విరుద్ధమైన ఆశయాలు, నష్టదాయకమైన అంతర్గత వివాదాల చరిత్ర ఉన్న పార్టీని ఆయన నడిపించాలి. అక్టోబర్ 25న మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే రమీందర్ సింగ్ అవ్లా ఎస్‌ఎడిలో చేరడం, అభ్యర్థుల ఎంపిక, సంస్థాగత సమైక్యతను తేలికగా తీసుకోకూడదని గుర్తుచేస్తుంది. మరో ఎన్నికను తనతో తానే పోరాడుకుంటూ గడిపే స్థితిలో కాంగ్రెస్ లేదు. సంక్షేమ కార్యక్రమాలు ఆప్‌కు ఓ బలమైన భరోసా కల్పిస్తున్నది. ముఖ్యంగా ఉచిత విద్యుత్‌కు చాలా కుటుంబాలు విలువ ఇస్తాయి. అయితే, శాంతిభద్రతలపై ప్రజలలో నెలకొన్న అసంతృప్తిని తుడిచిపెట్టేస్తుందని భావించడం అపోహ కాగలదు. పార్టీ నినాదాలు సూచించిన దానికంటే ప్రజాభిప్రాయం చాలా సంక్లిష్టమైనది. ఈ మారుతున్న పొత్తులకు అతీతంగా, పంజాబ్ పెరుగుతున్న అప్పులు, నిరుద్యోగం, వ్యవసాయ స్తబ్దత, బలహీనపడుతున్న పారిశ్రామిక పోటీతత్వాన్ని ఎదుర్కొంటోంది. రాజకీయ పార్టీలు కేవలం ఎవరు ఎవరితో కూర్చుంటారనేది మాత్రమే కాకుండా, పరిపాలనను ఎలా సంస్కరించాలనుకుంటున్నారో, ఆర్థిక వ్యవస్థను ఎలా పునరుద్ధరించాలనుకుంటున్నారో నచ్చచెప్పాల్సి ఉంది.

# ఎల్‌నినో.. సామాన్యుడిపైనే భారం

**అక్టోబర్ 27 (జర్నలిస్ట్ వార్త):**
వర్షాలు తగ్గితే చెరువులు, జలాశయాలు ఎండిపోవడమే కాదు.. పంటలు తగ్గుతాయి, పశు గ్రాసం కరువవుతుంది, నిత్యావసరాల ధరలు పెరుగుతాయి. చివరికి నెల జీతంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చే ఉద్యోగి నుంచి రెక్కల కష్టాన్ని నమ్ముకున్న పల్లె పేద వరకు అందరి బతుకులూ భారమవుతాయి. ప్రకృతి ప్రకోపానికి అందరూ బాధితులే అయినా, ఆ భారాన్ని భరించే శక్తి మాత్రం అందరికీ ఒకేలా ఉండదు. సూపర్ ఎల్‌నినో సృష్టిస్తున్న సంక్షోభంలో కనిపిస్తున్న అసమానత ఇదే! ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వర్షపాతం దీర్ఘకాలిక సగటులో సుమారు 87 శాతానికే పరిమితమైంది. సాధారణం కంటే 12.6 నుంచి 15% వరకు తక్కువ వర్షాలు నమోదయ్యాయి. 2001 తర్వాత అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన సంవత్సరాల్లో ఇది నాలుగోది. ఎల్‌నినో ప్రభావం అక్టోబరు నుంచి డిసెంబరు మధ్య తీవ్రస్థాయికి చేరి, 2027 ఆరంభం వరకు కొనసాగవచ్చన్న అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. అంటే రుతుపవనాల వైఫల్యంతో మొదలైన కష్టాలు చలికాలంతో ముగిసిపోతాయన్న భరోసా లేదు. నేలలో తేమ తగ్గడం, జలవనరులు అడుగంటడం, పంటల దిగుబడులు పడిపోవడం వంటి పరిణామాలు నిత్యావసరాల ధరలను మరింత పెంచవచ్చు. వర్షాభావం వ్యవసాయాన్ని దెబ్బతీస్తే దాని ప్రభావం పొలాలకే పరిమితం కాదు. ఖరీఫ్ దిగుబడులు లోటు వర్షపాతం సంవత్సరాల్లో సగటున 6.5%, ఎల్‌నినో ప్రభావిత సంవత్సరాల్లో 8.4% వరకు తగ్గుతున్నట్టు అంచనాలున్నాయి. ఈసారి ఆహార ధాన్యాలు, నూనెగింజల సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే 1.2 శాతం తగ్గింది.




వరి సాగు విస్తీర్ణం ప్రారంభ దశలోనే 15 లక్షల హెక్టార్లకు పైగా తగ్గడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. సరఫరా తగ్గితే ధరలు పెరుగుతాయి. ఇప్పటికే ఇరవై రోజుల వ్యవధిలో చక్కెర ధరలు 10.16 శాతం, పాలు 6.12 శాతం, పిండి 6.67 శాతం, పప్పుధాన్యాలు 4.68 శాతం పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. రబీ పంటలకూ తేమ కొరత ఎదురైతే ఆహార ద్రవ్యోల్బణం 7 శాతాన్ని దాటవచ్చన్న అంచనాలు వినియోగదారులను కలవరపెడుతున్నాయి. చక్కెర ఉత్పత్తి అంచనాలను 3.36 కోట్ల టన్నుల నుంచి 2.95 కోట్ల టన్నులకు తగ్గించడం మరో హెచ్చరిక. గ్రామీణ భారతాన్ని వేధించబోతున్నది నీటి కొరత ఒక్కటే కాదు.. పశుగ్రాసం సమస్య కూడా. దేశంలోని 178 ప్రధాన జలాశయాల్లో వర్షాకాలం ముగిసే సమయానికి నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే సుమారు 21% తక్కువగా ఉన్నాయి. తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాశయాల మొత్తం 585 టిఎంసిల నిల్వ సామర్థ్యానికి గాను 241 టిఎంసిల నీరే అందుబాటులో ఉన్నట్టు అంచనాలు చెబుతున్నాయి. భూగర్భ జలాల పునరుద్ధరణ దెబ్బతినడంతో అనేక ప్రాంతాల్లో బావులు, బోర్లు అడుగంటుతున్నాయి. ఊళ్లలో తాగునీటికి జనం అల్లాడుతుంటే, మరోవైపు బాటిల్ వాటర్ తయారీ కేంద్రాలు, బహుళజాతి శీతల పానీయాల సంస్థల కార్యకలాపాలు కొనసాగడం వనరుల పంపిణీలోని అసమానతలను ఎత్తిచూపుతోంది. నీటి కొరత ఏర్పడినప్పుడు ప్రాధాన్యం ప్రజల తాగునీటి అవసరాలకా, వాణిజ్య ప్రయోజనాలకా అన్నది ప్రభుత్వాలు తేల్చాలి. పాడి రంగంలోనూ ఇదే అంతరం కనిపిస్తోంది. పెద్ద డెయిరీ సంస్థలకు పశుదాణా కొనుగోలు, నిల్వ, రవాణా సదుపాయాలు మెరుగ్గా ఉంటాయి. కానీ స్థానికంగా లభించే పచ్చిమేత, పంటల అవశేషాలపై ఆధారపడే చిన్న రైతులకు ప్రత్యామ్నాయాలు పరిమితం. పాల ఉత్పత్తి వ్యయంలో 60 నుంచి 70 శాతం వరకు పశుదాణాకే ఖర్చవుతుండటంతో మేత ధరలు పెరిగితే చిన్న పాడి రైతుల ఆదాయం కుంచించుకుపోతుంది. పశువులకు మేత దొరక్క పాల దిగుబడి తగ్గితే రైతుకు నష్టం, వినియోగదారుడికి ధరల భారం రెండూ తప్పవు. సంక్షోభాన్ని తట్టుకునే వనరులు పెద్ద సంస్థలకు ఉండగా, చిన్న ఉత్పత్తిదారులే ఎక్కువగా నష్టపోతున్నారు. నెల జీతంపై ఆధారపడే మధ్యతరగతి పరిస్థితి భిన్నంగా లేదు. ఆదాయం స్థిరంగా ఉన్నా బియ్యం, పప్పులు, పాలు, వంట ఇంధనం, విద్యుత్తు, తాగునీటి ఖర్చులు పెరుగుతూనే ఉంటాయి.

# టీ20ల్లో ఫిన్ అలెన్ సిక్సర్ల సంచలనం!

### 400 సిక్సర్ల మైలురాయిలో అభిషేక్ శర్మను అధిగమించిన న్యూజిలాండ్ విధ్వంసకర బ్యాటర్.. రికార్డుల వేటలో మరో ముందడుగు

### ఆండ్రీ రస్సెల్ అగ్రస్థానం.. రెండో స్థానానికి దూసుకొచ్చిన అలెన్



**స్పోర్ట్స్ డెస్క్,** పొట్టి క్రికెట్‌లో భారీ సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తున్న న్యూజిలాండ్ విధ్వంసకర బ్యాటర్ ఫిన్ అలెన్ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. టీ20 క్రికెట్‌లో 400 సిక్సర్ల మైలురాయిని అత్యంత వేగంగా చేరుకున్న ఆటగాళ్ల జాబితాలో భారత యువ సంచలనం అభిషేక్ శర్మను అధిగమించి రెండో స్థానంలో నిలిచాడు. తనదైన దూకుడైన బ్యాటింగ్‌తో బౌలర్లపై విరుచుకుపడే అలెన్.. తక్కువ బంతుల్లోనే భారీ సిక్సర్ల మైలురాయిని అందుకోవడం ద్వారా మరోసారి తన సత్తా చాటాడు. టీ20 క్రికెట్‌లో వేగంగా పరుగులు సాధించే ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు పొందిన అలెన్.. ఈ ఘనతతో తన అభిమానులను ఆకట్టుకున్నాడు. **3,502 బంతుల్లోనే 400 సిక్సర్లు** టీ20 క్రికెట్‌లో 400 సిక్సర్లు బాదేందుకు ఫిన్ అలెన్ కేవలం 3,502 బంతులు మాత్రమే ఎదుర్కొన్నాడు. భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ ఘనతను అందుకోవడానికి 3,513 బంతులు తీసుకున్నాడు. దీంతో అభిషేక్ కంటే 11 బంతులు ముందుగానే 400 సిక్సర్ల మైలురాయిని చేరుకున్న అలెన్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ జాబితాలో వెస్టిండీస్ విధ్వంసకర ఆటగాడు ఆండ్రీ రస్సెల్ 3,027 బంతుల్లోనే 400 సిక్సర్లు బాది అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.టీ20 క్రికెట్‌లో సిక్సర్లు బాదడం ఒక ఎత్తయితే.. అతి తక్కువ బంతుల్లోనే వందల సంఖ్యలో సిక్సర్లను సాధించడం మరో ఎత్తు. ఈ విషయంలో రస్సెల్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తుండగా, అలెన్ కూడా అదే స్థాయి దూకుడుతో ముందుకు సాగుతున్నాడు. అభిషేక్ శర్మ సైతం ఈ జాబితాలో అగ్రస్థానాల కోసం పోటీ పడుతుండటంతో రాబోయే రోజుల్లో ఈ రికార్డులపై మరింత ఆసక్తి నెలకొనే అవకాశం ఉంది. **సిక్సర్ల రికార్డుల్లో టాప్ ఆటగాళ్లు వీరే!** టీ20 క్రికెట్‌లో 400 సిక్సర్ల మైలురాయిని అత్యంత తక్కువ బంతుల్లో చేరుకున్న ఆటగాళ్లలో ఆండ్రీ రస్సెల్ తొలి స్థానంలో ఉండగా, ఫిన్ అలెన్ రెండో స్థానాన్ని ఆక్రమించాడు. అభిషేక్ శర్మ మూడో స్థానంలో నిలిచాడు. ఆండ్రీ రస్సెల్: 3,027 బంతుల్లో 400 సిక్సర్లు ఫిన్ అలెన్: 3,502 బంతుల్లో 400 సిక్సర్లు అభిషేక్ శర్మ: 3,513 బంతుల్లో 400 సిక్సర్లు ఈ గణాంకాలు టీ20 క్రికెట్‌లో ఆటగాళ్ల దూకుడైన బ్యాటింగ్ శైలిని ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా తక్కువ బంతుల్లోనే బౌండరీలతో పాటు భారీ సిక్సర్లు సాధించే సామర్థ్యం ఆటగాళ్ల విజయాల్లో కీలకంగా మారుతోంది. ఈ క్రమంలో అలెన్ సాధించిన ఘనతకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. **భారత బౌలర్లపై అలెన్ దూకుడు** భారత్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లోనూ ఫిన్ అలెన్ తన దూకుడైన ఆటతీరును ప్రదర్శించాడు. 25 బంతులు ఎదుర్కొని ఐదు సిక్సర్లతో 40 పరుగులు సాధించాడు. ఆరంభం నుంచే భారీ షాట్లతో భారత బౌలర్లపై ఒత్తిడి పెంచాడు. అయితే నితీశ్ కుమార్ రెడ్డి బౌలింగ్‌లో నమన్ ధీర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. స్వల్ప వ్యవధిలోనే వేగంగా పరుగులు సాధించిన అలెన్.. న్యూజిలాండ్ జట్టు భారీ స్కోరు సాధించడంలో తన వంతు పాత్ర పోషించాడు. **భారీ స్కోరు సాధించిన న్యూజిలాండ్** ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 198 పరుగులు సాధించింది. అలెన్ వేగవంతమైన ఇన్నింగ్స్ జట్టు స్కోరు పెరగడానికి దోహదపడింది. భారత బౌలర్లు వికెట్లు సాధించేందుకు ప్రయత్నించినప్పటికీ న్యూజిలాండ్ బ్యాటర్లు పరుగుల వేగాన్ని కొనసాగించారు. భారత బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్ ఒక్కో వికెట్ పడగొట్టారు. **అభిషేక్ శర్మకూ అరుదైన గుర్తింపు** భారత యువ బ్యాటర్ అభిషేక్ శర్మ సైతం టీ20 క్రికెట్‌లో తనదైన ముద్ర వేస్తున్నాడు. తక్కువ బంతుల్లోనే భారీ పరుగులు సాధించడంతో పాటు సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచడంలో అతడు ప్రత్యేక గుర్తింపు పొందాడు. 3,513 బంతుల్లో 400 సిక్సర్ల మైలురాయిని చేరుకోవడం అతడి దూకుడైన ఆటతీరుకు నిదర్శనం. తాజాగా ఫిన్ అలెన్ అతడిని అధిగమించడంతో ఈ రికార్డు జాబితాలో స్థానాల మార్పు చోటుచేసుకుంది. మొత్తానికి టీ20 క్రికెట్‌లో భారీ సిక్సర్లతో అభిమానులను అలరిస్తున్న ఫిన్ అలెన్ మరోసారి వార్తల్లో నిలిచాడు. ఆండ్రీ రస్సెల్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అలెన్ రెండో స్థానానికి చేరడం, అభిషేక్ శర్మ మూడో స్థానంలో నిలవడం పొట్టి క్రికెట్‌లో సిక్సర్ల పోటీ ఎంత ఆసక్తికరంగా సాగుతోందో తెలియజేస్తోంది. భవిష్యత్తులో ఈ ముగ్గురు ఆటగాళ్లు మరిన్ని మైలురాళ్లను అందుకుంటారా అన్నది అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.



# హ్యారీ కేన్‌కు బాలన్ డి ఓర్.. కోహ్లీ ప్రత్యేక అభినందనలు!

### ● ఎన్నో ఏళ్ల కష్టం, పట్టుదలకు తగిన గుర్తింపు..

### మిత్రుడి విజయంపై విరాట్ హర్షం

**క్రీడా విభాగం:** ఫుట్‌బాల్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మక వ్యక్తిగత పురస్కారమైన బాలన్ డి ఓర్ అవార్డును గెలుచుకున్న ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ హ్యారీ కేన్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. జర్మనీకి చెందిన బేయర్న్ మ్యూనిక్ క్లబ్ తరఫున అద్భుత ప్రదర్శన చేసిన కేన్ ఈ పురస్కారాన్ని అందుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కూడా తన మిత్రుడికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపాడు. కేన్ సాధించిన విజయం వెనుక ఉన్న కష్టం, పట్టుదల, నిజాయతీని ప్రశంసిస్తూ సామాజిక మాధ్యమం వేదికగా సందేశాన్ని పంచుకున్నాడు. **నీ విజయానికి నువ్వు అర్హుడివి: కోహ్లీ** హ్యారీ కేన్‌ను తన ఆత్మీయ మిత్రుడిగా సంబోధించిన విరాట్ కోహ్లీ.. అతడు సాధించిన ఘనత పట్ల సంతోషం వ్యక్తం చేశాడు. ఫుట్‌బాల్ క్రీడలో ఎన్నో ఏళ్లుగా కేన్ చూపిస్తున్న పట్టుదల, కఠోర శ్రమ, నిలకడైన ప్రదర్శనకు ఈ పురస్కారం తగిన గుర్తింపుగా అభివర్ణించాడు. ఉన్నత స్థాయిలో ఆడుతూ తన వ్యక్తిత్వాన్ని, క్రీడాస్ఫూర్తిని కాపాడుకోవడం గొప్ప విషయమని ప్రశంసించాడు. కేన్ ఈ అవార్డును అందుకోవడానికి పూర్తిగా అర్హుడని పేర్కొన్న కోహ్లీ.. అతడి కుటుంబానికి కూడా శుభాకాంక్షలు తెలిపాడు. కేన్ సాధించిన విజయాన్ని చూసి కుటుంబ సభ్యులు గర్వపడతారని, అతడు కూడా తన ప్రయాణం పట్ల గర్వపడాలని ఆకాంక్షించాడు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటూ తన శుభాకాంక్షలను తెలియజేశాడు.

# అభిషేక్ శర్మ విధ్వంసం.. న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం!

### ● మెరుపు శతకంతో చెలరేగిన యువ ఓపెనర్..

### మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్ కైవసం



**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ గడ్డపై భారత క్రికెట్ జట్టు విజయ పరంపరను కొనసాగిస్తోంది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా జరిగిన మూడో మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ విధ్వంసక శతకంతో చెలరేగగా, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కీలక ఇన్నింగ్స్‌తో జట్టు విజయంలో భాగస్వామి అయ్యాడు. వీరిద్దరి దూకుడుతో భారత్ ఆరు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించి, మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్‌ను 30తో సొంతం చేసుకుంది. **అభిషేక్ శర్మ మెరుపు శతకం** భారత ఇన్నింగ్స్‌లో అభిషేక్ శర్మ ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ పరుగుల వరద పారించాడు. క్రీజులో కుదురుకున్న తర్వాత తనదైన దూకుడుతో బౌండరీలు, సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అతడి అద్భుత బ్యాటింగ్‌తో భారత జట్టు లక్ష్య ఛేదన సులభతరమైంది. అభిషేక్ శర్మ 113 పరుగులు చేసి జట్టు విజయానికి బలమైన పునాది వేశాడు. **వైభవ్ సూర్యవంశీ కీలక ఇన్నింగ్స్** అభిషేక్ శర్మకు తోడుగా యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కూడా రాణించాడు. 45 పరుగులు చేసి జట్టు విజయానికి తన వంతు సహకారం అందించాడు. ఇద్దరి దూకుడుతో భారత బ్యాటింగ్ విభాగం ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించింది. కీలక సమయంలో పరుగులు సాధించడం ద్వారా భారత్ విజయ దిశగా ముందుకు సాగింది. **భారత్ ఖాతాలో మరో సిరీస్ విజయం** ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 30తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించింది. సిరీస్ ప్రారంభం నుంచే నిలకడైన ఆటతీరును ప్రదర్శించిన టీమిండియా, మూడో మ్యాచ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. బ్యాటింగ్‌లో దూకుడు, కీలక సమయాల్లో ఆటగాళ్ల సమర్థత భారత విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవడం భారత జట్టు ఆధిపత్యానికి నిదర్శనంగా నిలిచింది. మిగిలిన మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించి సిరీస్‌ను పూర్తి స్థాయిలో ముగించాలని టీమిండియా లక్ష్యంగా పెట్టుకోనుంది. **అభిమానుల్లో హర్షాతిరేకాలు** అభిషేక్ శర్మ దూకుడైన బ్యాటింగ్, యువ ఆటగాళ్ల ప్రతిభ భారత క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అంతర్జాతీయ స్థాయిలో యువ ఆటగాళ్లు తమ సత్తా చాటుతుండటం జట్టుకు శుభపరిణామంగా మారింది. సమష్టి కృషితో న్యూజిలాండ్‌పై ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు మరోసారి తన విజయపరంపరను కొనసాగించింది.

# అర్ష్‌దీప్ సింగ్ అరుదైన ఘనత.. టీ20ల్లో 150 వికెట్లకు ఒక్క అడుగు దూరంలో!

న్యూజిలాండ్‌తో మూడో టీ20లో రికార్డు.. అంతర్జాతీయ టీ20ల్లో ఈ ఘనత సాధించనున్న తొలి భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించే అవకాశం

**వెల్లింగ్టన్:** భారత క్రికెట్ జట్టు ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో మరో అరుదైన మైలురాయికి చేరువయ్యాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో టీ20 మ్యాచ్‌లో కీలక వికెట్ సాధించి తన ఖాతాలో 149వ వికెట్‌ను వేసుకున్నాడు. దీంతో అంతర్జాతీయ టీ20ల్లో 150 వికెట్ల మైలురాయిని చేరుకోవడానికి ఒక్క వికెట్ దూరంలో నిలిచాడు. తదుపరి వికెట్ సాధిస్తే ఈ ఘనతను అందుకున్న తొలి భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించనున్నాడు. తన పదునైన బంతులు, స్వింగ్, కీలక సమయాల్లో వికెట్లు పడగొట్టే సామర్థ్యంతో జట్టులో ప్రత్యేక గుర్తింపు పొందిన అర్ష్‌దీప్ మరోసారి వార్తల్లో నిలిచాడు. **టిమ్ సీఫెర్ట్‌ను ఔట్ చేసి 149వ వికెట్** వెల్లింగ్టన్ వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. ఈ క్రమంలో భారత బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ప్రత్యర్థి జట్టు ఓపెనర్ టిమ్ సీఫెర్ట్‌ను పెవిలియన్‌కు పంపించాడు. ఈ వికెట్‌తో అతడి అంతర్జాతీయ టీ20 వికెట్ల సంఖ్య 149కి చేరింది. తద్వారా పొట్టి క్రికెట్‌లో అత్యధిక వికెట్లు సాధించిన పేసర్ల జాబితాలో తన స్థానాన్ని మరింత



మెరుగుపరుచుకున్నాడు. **భారత క్రికెట్‌లో కొత్త చరిత్రకు చేరువ** అంతర్జాతీయ టీ20ల్లో 150 వికెట్లు సాధించడం బౌలర్ స్థిరమైన ప్రదర్శనకు నిదర్శనం. ముఖ్యంగా బ్యాటర్లకు అనుకూలంగా ఉండే ఈ ఫార్మాట్‌లో పరుగుల వేగాన్ని నియంత్రిస్తూ వికెట్లు తీయడం అంత సులభం కాదు. అలాంటి పరిస్థితుల్లో అర్ష్‌దీప్ వరుసగా మెరుగైన ప్రదర్శనలు చేస్తూ ఈ స్థాయికి చేరుకోవడం విశేషం. మరో వికెట్ సాధిస్తే 150 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా తన పేరును రికార్డుల్లో లిఖించుకోనున్నాడు. **అత్యధిక వికెట్లు సాధించిన పేసర్లలో అర్ష్‌దీప్** అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు సాధించిన పేసర్ల జాబితాలో బంగ్లాదేశ్‌కు చెందిన ముస్తాఫిజుర్ రెహ్మాన్ 163 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్ స్టార్ బౌలర్ టిమ్ సౌథీ 160 వికెట్లతో తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు. అర్ష్‌దీప్ సింగ్ 149 వికెట్లతో మూడో స్థానానికి చేరుకోగా, బహ్రెయిన్‌కు చెందిన రిజ్వాన్ బట్ 148 వికెట్లతో తర్వాతి స్థానంలో ఉన్నాడు. ఐర్లాండ్‌కు చెందిన మార్క్ అడైర్ 142 వికెట్లతో ఈ జాబితాలో కొనసాగుతున్నాడు. **కీలక బౌలర్‌గా ఎదిగిన అర్ష్‌దీప్** భారత జట్టులో ఎడమచేతి వాటం వేగవంతమైన బౌలర్‌గా అర్ష్‌దీప్ సింగ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. కొత్త బంతితో వికెట్లు తీయడంతో పాటు చివరి ఓవర్లలోనూ ఒత్తిడిని తట్టుకుని బౌలింగ్ చేయగలగడం అతడి ప్రత్యేకత. అంతర్జాతీయ టీ20ల్లో అతడి ప్రదర్శన జట్టు విజయాల్లో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. ఇప్పుడు 150 వికెట్ల మైలురాయికి చేరువ కావడంతో అభిమానులు అతడి తదుపరి ప్రదర్శనపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.మొత్తంగా అర్ష్‌దీప్ సింగ్ సాధించిన 149 వికెట్లు భారత టీ20 క్రికెట్‌కు గర్వకారణంగా నిలుస్తున్నాయి. మరో వికెట్‌తో అరుదైన ఘనతను అందుకునే అవకాశం ఉండటంతో ఈ మ్యాచ్ అతడి కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోనుంది. భారత క్రికెట్ చరిత్రలో మరో మైలురాయిని నమోదు చేసేందుకు అర్ష్‌దీప్ సిద్ధంగా ఉన్నాడు.

# ధోనికి ఉన్న ఆ ప్రత్యేక లక్షణం నాకూ కావాలి!

### - మైదానంలో ఆటను అర్థం చేసుకోవడమే ధోని విజయ రహస్యం: ఫాఫ్ డుప్లెసిస్

**ఇంటర్నెట్ డెస్క్:** భారత మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోని నాయకత్వంపై దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ ప్రశంసలు కురిపించాడు. మైదానంలో పరిస్థితులను అర్థం చేసుకుంటూ, ఒత్తిడిలోనూ ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవడం ధోనిలోని ప్రత్యేక లక్షణమని పేర్కొన్నాడు. ఆ లక్షణాన్ని తాను కూడా తన నాయకత్వంలో అనుసరించాలని కోరుకుంటున్నట్లు వెల్లడించాడు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన డుప్లెసిస్.. ధోని మ్యాచ్‌కు ముందే ఎక్కువగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం కంటే, ఆట జరుగుతున్న సమయంలో పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకోవడానికి ప్రాధాన్యమిస్తాడని తెలిపాడు. ప్రత్యర్థి ఆటగాళ్లను, మైదానంలోని పరిస్థితులను నిశితంగా గమనిస్తూ సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడమే ధోని ప్రత్యేకత అని వివరించాడు.ధోని ఆటను అర్థం చేసుకునే విధానం,




అతడి సంయమనం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని డుప్లెసిస్ పేర్కొన్నాడు. ఈ లక్షణాలను తన నాయకత్వంలోనూ అనుసరించాలని ఉందని చెప్పాడు.ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ధోని నాయకత్వంలో తొమ్మిది సీజన్ల పాటు ఆడిన డుప్లెసిస్.. ఆ జట్టు సాధించిన మూడు ఐపీఎల్ టైటిళ్లలో భాగస్వామిగా నిలిచాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో 154 మ్యాచ్‌లు ఆడి 4,773 పరుగులు సాధించాడు. 2022లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో చేరాడు

# ‘హంతకుడిని కాదు.. ప్రేమికుడిని’..

## ‘కింగ్’లో షారుక్ అదిరిపోయే లుక్



బుల్లెట్ చేతిలో ఉంది.. పెదాల మధ్య గులాబీ ఉంది.. చూపుల్లో మాత్రం కసి కనిపిస్తోంది! బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ తన కొత్త సినిమా ‘కింగ్’ పోస్టర్‌తో అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చాడు. ‘ఖతీల్ నహీ.. ఆశిక్ హూన్’ (హంతకుడిని కాదు.. ప్రేమికుడిని) అంటూ ఆసక్తికరమైన డైలాగ్‌ను జోడించాడు. ఈ పోస్టర్‌తో సినిమా మీద అంచనాలను మరింత పెంచాడు. ఈ సినిమా 2026 డిసెంబర్ 24న థియేటర్లలోకి రానుంది.షారుక్ మంగళవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ పోస్టర్‌ను పంచుకున్నాడు. అందులో అతడు నోట్లో గులాబీ పువ్వు పెట్టుకుని, చేతిలో తుపాకీ పట్టుకుని కనిపించాడు. ఆయన చూపుల్లోని తీవ్రత పాత్రపై ఆసక్తిని పెంచుతోంది. ‘మళ్లీ గుర్తొచ్చింది.. హంతకుడిని కాదు, ప్రేమికుడిని’ అంటూ పోస్టర్‌కు క్యాప్షన్ ఇచ్చాడు.సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘కింగ్’ యాక్షన్ థ్రిల్లర్. ఈ చిత్రంలో షారుక్ కుమార్తె సుహానా ఖాన్ కీలక పాత్ర పోషిస్తోంది. తండ్రీకూతుళ్లు తొలిసారి కలిసి తెరపై కనిపించనుండటం ఈ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. అభిషేక్ బచ్చన్ ప్రతినాయకుడిగా కనిపించనున్నాడు.దీపికా పదుకొణె, అనిల్ కపూర్, రాణి ముఖర్జీ, జైదీప్ అహ్లావత్, జాకీ ష్రాఫ్, రాఘవ్ జుయల్, అభయ్ వర్మ కూడా ఇందులో నటిస్తున్నారు. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సినిమా కథ, ఇతర వివరాలను చిత్రబృందం ఇంకా వెల్లడించలేదు.
సుహానా ఖాన్ 2023లో ‘ది ఆర్చీస్’తో నటిగా పరిచయమైంది. షారుక్ చివరిగా ‘డంకీ’ సినిమాలో కనిపించాడు. రాజ్‌కుమార్ హిరానీ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం 2023లో విడుదలైంది

# నా బయోపిక్ నిజం కాదు..

## అందులో చూపించింది 10 శాతమే.. అసలు కథ వేరు: మేరీ కోమ్




భారత లెజెండరీ బాక్సర్ మేరీ కోమ్ తన జీవితం ఆధారంగా వచ్చిన ‘మేరీ కోమ్‘ బయోపిక్‌పై 12ఏళ్ల తర్వాత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ సినిమా వాస్తవానికి చాలా దూరంగా ఉందని, తన నిజమైన కష్టాన్ని అందులో కేవలం 10 శాతం మాత్రమే చూపించారని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ‘బిగ్ బాస్ 20‘ హౌస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలు వెల్లడించారు. 2014లో ఒమంగ్ కుమార్ దర్శకత్వంలో విడుదలైన ‘మేరీ కోమ్‘ బయోపిక్‌లో ప్రియాంక చోప్రా ప్రధాన పాత్ర పోషించారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించడమే కాకుండా, ప్రియాంక నటనకు జాతీయ ఉత్తమ నటి అవార్డును కూడా తెచ్చిపెట్టింది. అయితే, ఈ సినిమాపై మేరీ కోమ్ తాజాగా పెదవి విప్పారు. “ఆ బయోపిక్ నిజం కాదు. అందులో చూపించిన దానికంటే నా జీవితంలో సంఘర్షణ చాలా ఎక్కువ. కేవలం 10 శాతం కష్టాన్ని మాత్రమే సినిమాలో చూపించారు. నా అసలు జీవిత పోరాటం, కఠోర శ్రమ గురించి తెలియాలంటే నా ఆత్మకథ ‘అన్‌బ్రేకబుల్‘ చదవాలి“ అని ఆమె స్పష్టం చేశారు. ఈ సినిమాకు సీక్వెల్ తీయాల్సిన అవసరం ఉందా అని అడిగిన ప్రశ్నకు.. “ఇప్పుడు సీక్వెల్ అవసరం లేదు. నా కథ, నా ప్రయాణం గురించి అందరికీ ఇప్పటికే తెలుసు. భవిష్యత్తు ప్రశాంతంగా, సంతోషంగా ఉంటుందని ఆశిస్తున్నాను“ అని మేరీ కోమ్ బదులిచ్చారు. ఆసక్తికరంగా 2022లో ప్రియాంక చోప్రా కూడా ఈ సినిమా పాత్ర ఎంపికపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. “మణిపూర్‌కు చెందిన మేరీ కోమ్ పాత్రను ఈశాన్య రాష్ట్రానికి చెందిన నటికే ఇచ్చి ఉండాల్సింది. కానీ, ఒక నటిగా ఆ పాత్ర పోషించాలనే అత్యాశతో నేను ఒప్పుకున్నాను. ఆమె పాత్ర పోషించడానికి శారీరకంగా, మానసికంగా చాలా కష్టపడ్డాను. దాదాపు ఐదు నెలల పాటు బాక్సింగ్ శిక్షణ తీసుకున్నాను. ఆమెలా కనిపించకపోయినా, ఆమె స్ఫూర్తిని నాలో నింపుకోవాలని నిర్ణయించుకున్నాను. ఇందుకోసం ఆమెతో, ఆమె కుటుంబంతో చాలా సమయం గడిపాను“ అని ప్రియాంక చోప్రా ఒక ఇంటర్వ్యూలో వివరించారు. ఒకవైపు బయోపిక్ విజయం సాధించి, నటిగా ప్రియాంకకు ఎంతో పేరు తెచ్చిపెట్టినా, 12ఏళ్ల తర్వాత ఆ సినిమాలోని వాస్తవికతపై స్వయంగా మేరీ కోమ్ అసంతృప్తి వ్యక్తం చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# ‘హుషారు 2‘ టీజర్.. డబుల్ మ్యాడ్‌నెస్‌లో ఎర్రన్న సర్ ప్రైజ్

కుర్రకారును ఓ ఊపు ఊపిన కల్ట్ బాయ్స్ మళ్లీ వచ్చేశారు. యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా సూపర్ హిట్టయిన ‘హుషారు‘కు సీక్వెల్ గా రాబోతున్న ‘హుషారు 2‘ టీజర్ లేటెస్ట్ గా విడుదలైంది. దర్శకుడు శ్రీహర్ష కొనుగంటి ఈసారి రెట్టింపు మ్యాడ్ నెస్ తో ప్రేక్షకులను ఎంటర్టైన్ చేయడానికి సిద్ధమయ్యాడని అర్థమవుతుంది. మొదటి పార్ట్ తో పోలిస్తే ఈసారి స్కేల్ తో పాటు కథా నేపథ్యం కూడా భారీగా మారడం ఆసక్తిని పెంచుతోంది. గతంలో లాగా కేవలం సిటీ బ్యాక్ డ్రాప్, పబ్స్ కే పరిమితం కాకుండా, ఈసారి కుర్రాళ్ల గ్యాంగ్ ను ఒక సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లారు. టీజర్ మొదట్లోనే ‘చిత్రగుంజ్‘ అనే ఒక భయంకరమైన ప్రాంతాన్ని పరిచయం చేశారు. ఒకవైపు రక్తంతో రాజ్యాన్ని ఏలే రాక్షస పాలకులు, మరోవైపు అడవిలో క్రూరంగా వేటాడే సాయుధులు.. ఈ రెండు వర్గాల మధ్య నలిగిపోతున్న ప్రజలు.. ఇలా ఒక ఇంటెన్స్ సెటప్ తో దర్శకుడు కథను ఓపెన్ చేశాడు. అయితే ఆ సీరియస్ వాతావరణంలోకి కల్ట్ బాయ్స్ ఎంట్రీ ఇవ్వడంతో అసలు రచ్చ మొదలైంది. హాలిడే ఎంజాయ్ చేద్దామని వెళ్లిన ఈ బ్యాచ్, ఆ ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఇరుక్కుని పడే పాట్లు ఫుల్ ఫన్ జెనరేట్ చేస్తున్నాయి. లాస్ట్ టైమ్ కేవలం బీర్ తో ఎంజాయ్ చేస్తే.. ఈసారి




ఏకంగా టెక్విలా షాట్స్ అంటూ రాహుల్ రామక్రిష్ణ ఎంటర్టైన్మెంట్ కూడా హైలెట్ అవుతోంది. పామును చూసి వణికిపోవడం, అమ్మాయిలతో పులిహోర కలపడం లాంటి సీన్స్ వాళ్ల పాత బ్రాండ్ ను పర్ఫెక్ట్ గా కంటిన్యూ చేస్తున్నాయి.సన్నీ ఎంఆర్, రామ్ మిరియాల బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఈ టీజర్ కు బలంగా నిలిచింది. పక్కా మాస్ బీట్స్ తో విజువల్స్ కు తగ్గ ఎనర్జీని ఇచ్చారు. డైరెక్టర్ శ్రీహర్ష ఒక క్రైమ్ అండ్ యాక్షన్ డ్రామాను, అవుట్ అండ్ అవుట్ యూత్ ఫుల్ కామెడీని బ్యాలెన్స్ చేసిన విధానం ఆకట్టుకుంటోంది. ఎక్కడా బోర్ కొట్టకుండా, ఫాస్ట్ కట్స్ తో ఈ ఫ్రాంచైజీ ఏ పేస్ లో సాగనుందో ముందుగానే హింట్ ఇచ్చేశారు. ఒకవైపు పవర్ఫుల్ విలన్స్, మరోవైపు గిరిజన వేషధారణలో ఉన్న మనుషులు.. వీళ్ల మధ్యలో ఇరుక్కున్న హుషారు కుర్రాళ్ల గ్యాంగ్ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరిగెత్తే యాక్షన్ ఎపిసోడ్స్ మంచి థ్రిల్ ఇస్తున్నాయి. గాల్లో ఎగురుతూ జీపులు పేలిపోవడం, నలుగురూ కలిసి బందీలుగా మారిన ట్రాక్ కచ్చితంగా థియేటర్లలో హిలేరియస్ గా వర్కౌట్ అయ్యేలా ఉంది. కేవ్‌మ్యాన్ స్టోరీస్ బ్యానర్‌పై వస్తున్న ఈ చిత్రం విజువల్ గానూ చాలా రిచ్ గా కనిపిస్తోంది.



# మృణాల్ దీపావళి మెరుపులు

బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ తనదైన అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి మృణాల్ ఠాకూర్, తాజాగా సోషల్ మీడియాలో పంచుకున్న -దివాళీ ఎడిషన్- ఫొటోషూట్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఈ ఫొటోలలో మృణాల్ నలుపు రంగు శారీ ధరించి రాయల్ అండ్ క్లాసీ లుక్‌తో కనిపించారు. క్లాసిక్ శైలికి ఆధునిక స్పర్శను జోడిస్తూ ఆమె ఇచ్చిన స్టిల్స్ నెటిజన్లను ఎంతగానో అలరిస్తున్నాయి. డబుల్ మ్యాడ్‌నెస్‌లో ఎర్రన్న సర్ ప్రైజ్ శాూంం ఎఎ ఈ రాయల్ అండ్ ఎలిగెంట్ లుక్ వెనుక ఒక పెద్ద స్టైలింగ్ టీమ్ పనిచేసింది. -ఇత్రు- బ్రాండ్‌కు చెందిన నల్లటి డిజైనర్ శారీలో మృణాల్ మెరిసిపోగా.. ఈ లుక్‌ను అంజలి-స్నేహల్ అత్యంత ఆకర్షణీయంగా స్టైల్ చేశారు. దానికి తగినట్లుగా -బెస్పోక్ ఓజెల్స్- హ్యాండ్‌బ్యాగ్, -అపరాజిత తూర్- ఫుట్‌వేర్‌ను మ్యాచ్ చేశారు. మేకప్ ఆర్టిస్ట్ మిస్ బ్లెండర్, హెయిర్ స్టైలిస్ట్ దీపాలి దేవకర్ , శారీ డిజైనర్ శిల్పా ఈ బ్యూటీని దేవకన్యలా తీర్చిదిద్దగా, విధి గోధా తన కెమెరాతో ఈ అందమైన ఫొటోలను బంధించారు.సాధారణంగా పండుగల సమయాల్లో ఎరుపు, పసుపు వంటి సాంప్రదాయ రంగులను ఎంచుకుంటారు.. కానీ మృణాల్ మాత్రం నలుపు రంగు శారీని ఎంచుకుని సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేశారు. మృణాల్ అందమైన ఎక్స్ ప్రెషన్స్ కి తగ్గ డిజైనర్ లుక్ ఇది. అధునాతన శైలికి రాయల్ అలగెన్స్ జోడిస్తే ఎంత బావుంటుందో ఈ ఫొటోషూట్ చెప్పకనే చెబుతోంది. ఈ ఫొటోలకు ఇంటర్నెట్ లో స్పందన అద్భుతం. శోభిత ధూళిపాళ, ప్రగ్యా వంటి తోటి నటీమణులు ఈ లుక్‌పై ప్రశంసలు కురిపించగా.. నెటిజన్లు --బ్లాక్ శారీలో మృణాల్ దేవతలా ఉందంటూ-- కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.



# ప్రజా ప్రయోజన ప్రచారానికి డబ్బు తీసుకుంటారా?..

## బాలీవుడ్ సెలబ్రిటీలకు బాంబే హైకోర్టు చురకలు



ప్రజా ప్రయోజన కార్యక్రమాల్లో పాల్గొనేందుకు బాలీవుడ్ ప్రముఖులు భారీ మొత్తంలో పారితోషికం డిమాండ్ చేయడంపై బాంబే హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. సామాజిక బాధ్యతగా భావించి ఇటువంటి ప్రచార కార్యక్రమాల్లో ఉచితంగా పాల్గొనాలని, లేనిపక్షంలో వారిని సంప్రదించాల్సిన అవసరమే లేదని న్యాయస్థానం ఘాటుగా వ్యాఖ్యానించింది.
ముంబైలో వాయు, ధ్వని కాలుష్యంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. “ప్రజలకు మేలు చేకూర్చే కార్యక్రమాలకు సైతం సెలబ్రిటీలు నగదు ఎందుకు డిమాండ్ చేయాలి? ప్రజాధనాన్ని ఇటువంటి పారితోషికాల కోసం వృథా చేయకూడదు“ అని కోర్టు స్పష్టం చేసింది. నగరం నుంచి ఎంతో లబ్ధి పొందుతున్న నటీనటులు, సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత కూడా ఉందని ఈ సందర్భంగా హితవు పలికింది. ఉచితంగా సేవలందించేందుకు ఇష్టపడని బాలీవుడ్ తారల కంటే, ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములయ్యే మరాఠీ నటులను సంప్రదించడం ఉత్తమమని కోర్టు సూచించింది. ముంబై పోలీసుల ‘ఉమంగ్‘ వంటి కార్యక్రమాలకు సమయం కేటాయించే తారలు, ప్రజా సంక్షేమం కోసం ఒక 15 నిమిషాల సమయాన్ని ఉచితంగా కేటాయించలేరా? అని న్యాయస్థానం నిలదీసింది. కాలుష్యం వంటి అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, అందుకోసం ప్రభుత్వ ఖజానాపై భారం మోపడం సరికాదని ఈ సందర్భంగా అభిప్రాయపడింది.



# ఆన్‌లైన్‌లో దుష్ప్రచారం..

## సైబర్ క్రైమ్‌కి ఫిర్యాదు చేసిన విరోష్ టీం



విజయ్ దేవరకొండ, రష్మికపై ఆన్‌లైన్‌లో జరుగుతున్న దుష్ప్రచారంపై వారి టీం సైబర్ క్రైమ్ డిపార్ట్‌మెంట్ డిసిపికి ఫిర్యాదు చేసింది. ‘కాఫీ విత్ కరణ్’ ప్రోగ్రాంలో విజయ్, రష్మిక వ్యాఖ్యలను వక్రీకరిస్తూ కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తమ ఫిర్యాదులో పేర్కొంది. ఈ దుష్ప్రచారం ఇబ్బందులు కలగజేసిందని వారి టీమ్ ప్రతినిధి పేర్కొన్నారు. ఫేక్ పోస్టులకు సంబంధించిన సోషల్‌మీడియా ఖాతాలు, స్క్రీన్ షాట్స్, ఇతర వివరాలను పోలీసులకు అందజేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు వారికి హామీ ఇచ్చారు.